సంపుటి 8 సంచిక 2 జనవరి - ఫిబ్రవరి 2020

# పల్లెసృజన

www.pallesrujana.org

## గ్రామీణ సృజనా శక్తికి వెలుగుదారుల వేదిక

honeybee.org
Vol-8 Issue-2








# ఆకర్షణా? లేక వికర్షణా?



ఒక సీతాకోక చిలుకకి ఒక అనుమానం వచ్చింది. ఎందుకు కొన్ని పుష్పాలు మిగతా వాటికన్నా అందంగా ఉంటాయి? ఎందుకు కొన్ని పూలు తేనెటీగలని, సీతాకోక చిలుకలని ఆహ్వానిస్తాయి? మరికొన్ని ఏ ప్రయత్నమూ ఎందుకు చెయ్యవు? అందంగా లేని పూలకి గర్వమా? నిర్లక్ష్యమా? లేక తలపొగరా? విధమైన పద్ధతి ఇక భరించలేక ఒకరోజు సీతాకోక చిలుక కలబంద జాతికి చెందిన చెట్టుపైనున్న ఒక చిన్న పువ్వును ఇలా అడిగింది. "నువ్వు సీతాకోక చిలుకలని, తేనెటీగలని ఆకర్షించడానికి ఎందుకు ప్రయత్నించవు?" అని. దానికా చిన్న పువ్వు నవ్వి "చూడూ ప్రకృతిలో పునరుత్పత్తి జరగటానికి ఆకర్షణ, హంగులు ఒక్కటే కాదు గాలి, వాన, తుఫాను ఇవన్నీ పుప్పొడిని వ్యాపింపజేయటానికి తోడ్పడతాయి. అటువంటప్పుడు నేను కేవలం నాకు సహాయం చేసినందుకు భారీ ఫలితం (తేనె) కోరే తేనెటీగలపైందుకు ఆధారపడాలి?" అన్నది. సీతాకోక చిలుకకి ఈ సమాధానం సంతృప్తిని ఇవ్వలేదు. ఈ విముఖతకి కారణం తెలుసుకోవాలనిపించింది దానికి. తర్వాత అది 'గాలి రాణి' దగ్గరకు వెళ్ళి "అవును, నువ్వు ఎవ్వరినీ పట్టించుకోకుండా, కనీసం తేనెటీగలని గౌరవించకుండా వుండే పువ్వులకి కూడా పునరుత్పత్తికి సహకరిస్తున్నావట నిజమేనా?" అని అడిగింది. దానికి గాలి రాణి సీతాకోక చిలుక రెక్కలు అదిరిపోయేలా నవ్వి "ఈ ప్రపంచంలో సృజనాత్మకత అన్నది కేవలం ఆకర్షణలోనుంచేరాదు. వికర్షణలోం కూడా పుడుతుంది. అందుకే అడవిపూలు తమ విత్తనాలని సుదూర ప్రాంతాలకి కూడా విస్తరింపజేయగలవు. కానీ, అందమైన తొట్టెలోని పువ్వులు తమ విత్తనాలని తమదగ్గరే ఉంచుకుంటాయి. ఇప్పుడు చెప్పు ఎవరికి గర్వమెక్కువ? తమ విత్తనాలని తమవద్దే అంచుకునే తొట్టిలోని పువ్వులకా? లేక ఇతరులతో పంచుకునే అడవి పుష్పాలకా?" అన్నది.

సీతాకోక చిలుక స్థాణువైపోయింది. అయినా దాని అనుమానం తీరలేదు.

మరి మీకో? దీని సమాధానం మీవద్ద ఉందా?

**– హనీబీ 20 (3) – 2009**

Vol-8, Issue - 2 January - February 2020

## విషయ సూచిక

# పల్లెసృజన

సంపుటి-8 సంచిక-2 జనవరి - ఫిబ్రవరి 2020

పల్లెసృజన, 102, వాయుపురి,
సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్- 500 094.
ఫోన్ : 040-27111959, 98660 01678
E-mail : president@pallesrujana.org,
Visit at :www.pallesrujana.org

**సంపాదకవర్గం**

ప్రధాన సంపాదకులు :
**బ్రిగేడియర్ (రిటైర్డ్) పోగుల గణేశం,**

సంపాదకులు :
**జమ్మలమడక శశిమోహన్,**

ఉప సంపాదకులు :
**పల్లె వీర రాఘవ రెడ్డి**

సలహాదారులు :
**ప్రొ. అనిల్ గుప్త,**
**పి. చంద్రకాంత్ శర్మ,**
**జాగర్లమూడి దుర్గాప్రసాద్,**
**జమ్మలమడక శ్రీకర్,**

కార్టూన్స్ : **వెంకట్**

డిజైనింగ్ & ప్రింటింగ్ :
**నరేంద్ర గ్రాఫిక్స్,** హైదరాబాద్.
ఫోన్ : 81257 99904,
E-mail :
narendragrafixhyd@gmail.com

**Rs. 1,000/-**
**for 5 years Subscription**


బ్రతుకు పోరాటంలో 'సృజనకారుడు'
**ఉదయ భాస్కరుడు** 3





**నన్నం తిరుపతిరావు సృజనాత్మక శిక్షణ** 6



అలసిపోతున్న జ్ఞానం
**షేక్ హజ్రత్ వలీ** 9



పల్లెసృజన 'కుటుంబ సమావేశం' 12



**గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు** 18

'సృజనాత్మకత - వ్యాపారం'
అలవరచుకున్న అసామాన్యుడు
**చింతకాయల రాంబాబు** 22





తమ సృజనలకు పేటెంటు పొందిన
**నలుగురు ఇన్నోవేటర్లు** 27



'డా. కలాం ఇన్నోవేషన్ ఫెస్టివల్' లో
**వెలిగిన 'పల్లెసృజన' ఇన్నోవేటర్ల ప్రతిభ** 28



'నీరు - సైంధవ లవణం' లలో ఔషధ గుణాలు 30



32 **స్పందన**

కవర్ లోపలి పేజీల్లో ... **తెలియనిదాని గురించిన భయం** హనీబీ కథ, అమ్మకానికి సిద్ధంగా వున్న 'గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్స్'

మధ్య పేజీలో : **'తెలంగాణ ఇన్నోవేషన్ల ఉత్సవం'లో పల్లెసృజన వెలుగులు**


Printed, Published and Owned by **P. Ganesham** and Printed at **M/s Narendra Grafix**, 1-5-1055/2/14, Saibaba Nagar, Old Alwal, Secunderabad, Medchal- Malkajgiri Dist. - 500010.Telangana State and Published at 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal- Malkajgiri Dist. -500094. Telangana State, Editor : **J. Sesimohan.**

## HoneyBee Regional Collaborators & Publications

**Honey Bee (English)**
AES Boys Hostel Campus, Near Gujarat University Library & SBI Bank, Navrangapura, Ahmedabad - 380 009 Gujarat, India.
Phone: 91-79-27912792, Fax: 91-79-27913293 Email: honeybee@sristi.org

**Karshakan Samsarikkatte (Malayalam)**
Fr Hubby Mathew
Peermade Development Society,
Peermade, Idukki - 685531,
Kerala hmathew@gmail.com

**Num Vali Velanmai (Tamil)**
Mr P Vivekanandan
45, T P M Nagar,Virattipathu,
Madurai - 625010 Tamil Nadu
vivekseva@gmail.com

**Palle Srujana (Telugu)**
Brig Pogula Ganesham VSM (Retd)
102, Vayupuri, Sainikpuri Post
Secunderabad-500 094 Telangana.
president@pallesrujana.org, www.pallesrujana.org

**Loksarvani (Gujarati)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

**Sujh-Bujh Aas Paas ki (Hindi)**
SRISTI, P O Box No.15050
Ambawadi Ahmedabad - 380015 Gujarat
loksarvani@sristi.org

## సంపాదకీయం

# సమసమాజ అభివృద్ధికి పునాది "ఇన్నోవేటర్"

ప్రతి గ్రామంలో కొందరు ప్రత్యేక వ్యక్తులు ఉంటారు. ఊరి ప్రజలకు ఎలాంటి సాంకేతిక సహాయం కావలసి వున్నా ఈ ప్రత్యేక వ్యక్తులు చొరవ తీసుకుని ముందుకు వచ్చి సహకరిస్తారు. గ్రామస్తుల జీవన విధానంలోని సమస్యలకు ఈ ప్రత్యేక వ్యక్తులు పరిష్కారాలు వెతికి చూపిస్తారు. అవసరమైన పరికరాలను తయారు చేసి ఇస్తారు. ఉన్నవాటికి మెరుగులు దిద్దుతారు. దీని ద్వారా గ్రామ రైతుకు కాని, ఇతరత్రా గ్రామవాసులకు కాని సమయం మిగలడమో, కష్టం తగ్గడమో, ఉత్పత్తి పెరగడమో తప్పక జరుగుతుంది. వీరి కొత్తగా ఆలోచించే పద్ధతి... క్రియాశీలత, అనుకున్న ఆలోచనకు రూపం ఇవ్వడం, గ్రామస్తుల నిస్సహాయతను, నిరాశ, నిస్పృహలను నిర్మూలించి వారిని ఆనందమయ జీవితం వైపు తీసుకు వెళ్తాయి. ఇలాంటి ప్రత్యేక వ్యక్తులనే "ఇన్నోవేటర్" అంటారు.

ఈ 'ఇన్నోవేటర్' ఎవరైనా కావచ్చు. స్త్రీ, పురుషులు, పిల్లలు, ధనవంతులు, బీదవాళ్ళు, కులాలు, మతాలకు అతీతంగా ఉంటారు వీరు. వీరిలో కొందరు తమ స్వంత సమస్యలకు పరిష్కారాలు కనుగొంటే, మరికొందరు తమ చుట్టుప్రక్కల వ్యక్తులు, వృత్తిపరంగా సమస్యలు ఎదుర్కొంటున్న వారికి పరిష్కారాలు అందిస్తారు. సాధారణంగా ఇవి పరికరాలు, యంత్రాల రూపంలో ఉంటాయి. వీటిని ఇన్నోవేటర్లు స్థానికంగా దొరికే ముడిసరుకులు, ఇండ్లల్లో పనికి రావని పడేసిన వస్తువులతో తయారు చేస్తారు. వీరు వాడే టెక్నాలజీ చాలా సరళంగా, సాధారణమైందిగా వుండి 'ఇంతేనా' అనిపించేలా వుంటుంది. ఇలా స్థానిక వస్తువులతో, స్థానిక జ్ఞానంతో, స్థానికంగా పరిష్కారాలు అందించడం వల్ల, గ్రామస్తులకు కూడా వీటిని వాడటం సులభంగా వుంటుంది. అవసరమైనపుడు ఈ యంత్రాలను తమ పంటలకు, తమ భూమికి తగినట్టుగా తమంతట తామే చిన్న చిన్న మార్పులు చేసుకునే అవకాశం కూడా ఉంటుంది.

ఈ ప్రక్రియ ఎన్నాళ్ళుగా సాగుతుందో సరిగ్గా తెలియదు కాని ఆధునిక వ్యవసాయ యంత్రాలతో ప్రారంభించినపుడు ఆ యంత్రాలకు కావలసిన సమర్థత గ్రామాల్లో లేకపోవడం వల్ల మెకానిక్‌ల రూపంలో మండల, తాలూకా స్థాయిల్లో సాంకేతిక సహాయం స్థానికంగా ప్రారంభమైంది. ఆధునిక యంత్రాలు ఎక్కడ చేయబడతాయో కాని అవి పరిశ్రమకు ప్రామాణికంగా ఉంటాయి కాని, ప్రతి పంటకు, ప్రతి పొలానికి, ప్రతి మట్టి వరవడికి పూర్తిగా అనుకూలంగా ఉండటం కుదరదు. అయితే రైతులు ఈ యంత్రాలను కొనక తప్పదు, అవి సబ్సిడీల రూపంలో ప్రభుత్వం ద్వారా రైతులకు లభ్యమవుతాయి. కాని ఉపయోగించే సమయంలో రైతులకు ఇబ్బందులు ప్రారంభమవుతాయి. ఈ ఇబ్బందులను తొలగించుకోవడానికి రైతులు మెకానిక్‌లను సంప్రదిస్తారు. వారు రైతుల సమస్యలను తీర్చడానికి శాయశక్తులా తమ క్రియాశీలతతో, తపనతో ఆ యంత్రాలను సరిదిద్దుతారు. కొన్ని అవసరాలకు కొత్త పనిముట్లు కూడా తయారు చేస్తారు. ఈ రెండు పద్ధతులు రైతులకు తప్పక మేలు చేస్తాయి. వారి ఉత్పాదకత పెరగడం, లాభాలు రావడం జరుగుతుంది. ఇలా 'రైతు–మెకానిక్' బంధం వేల గ్రామాల నిరంతర అభివృద్ధికి తెలుగు రాష్ట్రాల్లో కారణమైంది. ఆర్థికంగా ఇన్ని ప్రాంతాల్లో వ్యవసాయ యాంత్రికత ప్రారంభమైనప్పటినుండి నిరంతర అభివృద్ధి సాధించబడిందంటే వీటికి ప్రధాన కారణం 'రైతు–మెకానిక్'ల బంధం. మెకానిక్‌లపై రైతులకున్న విశ్వాసం. ఆ విశ్వాసాన్ని నిలబెట్టువడానికి మెకానిక్‌లు చేసిన కృషి, తపన, క్రియాశీలత...




ఈ మెకానిక్‌లనే పల్లెసృజన 'ఇన్నోవేటర్లు' అంటుంది. ఒక మెకానిక్ ఇన్నో వేటర్‌గా పిలవబడడంతో ఆయన సామాజిక స్థాయి పెరుగుతుంది. అతని జ్ఞానం వల్లనే ఇన్నోవేటర్‌కు సమాజంలో చదువు, పదవి, సంపదలతో నిమిత్తం లేకుండా ప్రత్యేక స్థానాన్ని ఇస్తుంది. పల్లెసృజన గత పదిహేనేళ్ళ కృషితో సమాజంలో ఇన్నోవేటర్‌కు ఒక ప్రత్యేక స్థాయిని సృష్టించ గలిగింది. వీరికి మరింత గుర్తింపు, కొంత తోడ్పాటు అందించడం మన సమాజ కర్తవ్యం. వారిని కాపాడుకోవడం మన బాధ్యత.

పల్లెసృజన దృష్టికి వచ్చినవారి కథలు ప్రచురిస్తున్నాం. ఇంకా ఎన్నో ప్రచురించాలి. ఎంతోమంది ఇన్నోవేటర్లను వెతికి, వారి జ్ఞానాన్ని సేకరించి తెలుగు రాష్ట్రాలలో ప్రాచుర్యం కల్పించాలి. సమాజంలోని ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు, వాలంటీర్లు, ఇన్నోవేటర్లు ఈ ప్రయత్నంలో భాగస్వాములు కావాలి.

ఫిబ్రవరి 8–9 తేదీల్లో జరిగిన "పల్లెసృజన కుటుంబ సమావేశం" ఒక అద్భుత కలయిక. దీని గురించి ఈ సంచికలో ప్రచురించాం. ఉప్పుతేళ్ళ ఏడుకొండలు (కృష్ణ) కృషితో ఆంధ్రప్రదేశ్‌లో 2019–20లో ఇప్పటికే యాభై కంటే ఎక్కువ ఇన్నోవేటర్లను గుర్తించ గలిగాం. వీరందరి కథలు, వారి అద్భుత సృజనలు, వాటివల్ల ఉపయోగాలు అన్నీ పల్లెసృజన పత్రిక ద్వారా మీకు అందిస్తాం. మరింతమంది కొత్త ఇన్నోవేటర్లను గుర్తించడంలో పల్లెసృజన మీ అందరి సహకారాన్ని కోరుతోంది.

**భవదీయ**

బ్రిగేడియర్ పోగుల గణేశం (రిటైర్డ్)



# బ్రతుకు పోరాటంలో 'సృజనకారుడు'
# ఉదయ భాస్కరుడు

- జమ్మలమడక శశిమోహన్
- పల్లె వీరరాఘవ రెడ్డి

తెలంగాణ రాష్ట్రంలోని మహబూబాబాద్ జిల్లా, గూడూరు మండలం, గుండెంగ గ్రామానికి చెందిన కాసోజు సోమయ్య, సక్కుబాయిల పుత్రుడు 'కాసోజు ఉదయ భాస్కర్'. భార్య స్ఫూర్తి వాహిని, కూతురు పేరు స్వర్ణమయి ప్రస్తుతం పదవ తరగతి చదువుతున్నది. ఉదయ భాస్కర్ పదవ తరగతి ఉత్తీర్ణుడు కాలేక పోయాడు. రెండుమూడుసార్లు మళ్ళీ మళ్ళీ వ్రాసినా పాస్ కాలేక పోవటంతో ఇక ఈ చదువు తనవల్ల కాదు అనుకుని హైదరాబాద్‌కు మకాం మార్చి జీవన పోరాటం మొదలు పెట్టాడు. హైదరాబాద్ లోని వారి మామయ్య వద్ద వుండి అతని సలహాతో వడ్రంగి వృత్తి నేర్చుకున్నాడు. నేర్చుకున్న తర్వాత ఒక సంవత్సరం పాటు తానే స్వయంగా తిరిగి స్వంతంగా వడ్రంగి వృత్తి పనులు చేస్తుండేవాడు. ఉదయ భాస్కర్ వడ్రంగి వృత్తిపని బాగా ఎదిగి పోవటంతో తనకు తోడుగా నలుగురు పనివారిని కూడా పెట్టుకుని జీవనం సాగిస్తూ వుండేవాడు. పనివారు తాము పనిలో నిష్ణాతులు అయిన తర్వాత వారు స్వంతంగా పనులు చేసుకోవడం పరిపాటే. అలా పనివారితో ఎప్పుడూ సమస్యగానే వుండేది. ఆ తర్వాత ప్రభుత్వం 100 రోజుల పని పథకంతో కూలీలు లభించడం ఇంకా కష్టమైంది. ఇక ఈ పని చేయటం, వర్కర్ల కోసం తాను వెంపర్లాడే బదులు ఏదైనా స్వంతంగా చేసుకునే పని చేస్తే బావుండు అనుకున్నాడు.

ఆ రోజుల్లో పట్టణాల్లో ఇంటర్‌నెట్ సెంటర్‌లకు గిరాకీ బాగా వుంది అనిపించి, తానూ హైదరాబాద్ లోని కొత్తపేట ప్రాంతంలో ఒక ఇంటర్‌నెట్ సెంటర్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. అది రెండుమూడు సంవత్సరాలు బాగానే నడిచింది. కానీ, మొబైల్ టచ్ ఫోన్‌లు విరివిగా మార్కెట్‌లోకి రావటం, వాటిల్లో ఇంటర్‌నెట్ సౌకర్యం పెరిగిపోవటంతో తన ఇంటర్‌నెట్ సెంటర్ కు కూడా గిరాకీ తగ్గిపోయింది. అప్పుడు మళ్ళీ తన ఆలోచనలకు పదును పెట్టి వ్యాపారం అనేది రోజురోజుకూ ఎదిగేదిగా వుండాలి కానీ, కాలక్రమంలో తగ్గిపోయేది, సాంకేతికత మూలంగా మూతపడే వ్యాపారాలు చేయకూడదు అనుకున్నాడు.

అప్పుడే ప్లాస్టిక్ సీసాల వ్యాపారం పెరిగిపోవటంతో ఇందులో తన వ్యాపారం ఎంచుకుంటే బావుంటుంది. ఇది ఇప్పట్లో తగ్గేది కాదు కదా అని ఆలోచించి, ప్లాస్టిక్ సీసాలు కాకుండా ఆ సీసాల మూతలు, ఇతర వినియోగదారులు ఏవైనా సరే ఒక 'డై' తెస్తే వాటితో ప్లాస్టిక్ వస్తువులు తయారు చేసే 'ఇంజక్షన్ మౌల్డింగ్' యంత్రాన్ని కొని వ్యాపారాన్ని


మొదట తయారు చేసుకున్న తన యంత్రానికి ప్లాస్టిక్ ముడిసరుకును తోడే యంత్రం

ప్రారంభించాడు. తాను వడ్రంగి, ఇంటర్‌నెట్ సెంటర్ వ్యాపారాల్లో సంపాదించిన డబ్బుతో అప్పటికే ఒక ఇంటి స్థలాన్ని కొనుగోలు చేసి వుండటంతో దాన్ని అమ్మేసి పదిహేను లక్షలు ఖర్చు చేసి ఈ ప్లాస్టిక్ మౌల్డింగ్‌లు తయారు చేసే యంత్రాన్ని కొనుగోలు చేసి, హైదరాబాద్ లోని జీడిమెట్లలో ఏర్పాటు చేసుకున్నాడు. అదీ కొంత కాలం బాగానే నడిచింది. మళ్ళీ కూలీల సమస్య వల్ల తన వ్యాపారానికి దెబ్బ పడే సూచన కనిపించింది ఉదయ భాస్కర్‌కు.

ఇందులో కూడా కూలీల సమస్య కారణంగా మళ్ళీ వ్యాపారం మార్చే బదులు ఇందులోనే సమస్యలకు పరిష్కారం చూసుకోవాలి అనుకున్నాడు. తాను అప్పటికే వడ్రంగి పనిలో బాగా నైపుణ్యం వున్నవాడు. ఇంటర్‌నెట్ సెంటర్ నడిపిన అనుభవం వుంది. ఆ అనుభవాలతో తన ఫ్యాక్టరీలో ప్లాస్టిక్ ముడి పదార్థాన్ని యంత్రంలోకి మోసుకు వెళ్ళి వేయటానికి కూలీల ఖర్చు ఎక్కువ అవుతుందని గ్రహించి, ఈ సమస్య పరిష్కారానికి తానే ఒక యంత్రానికి కంప్యూటర్‌లోనే రూపకల్పన చేసుకున్నాడు.

ఈ క్రమంలో ముందుగా ఎయిర్ కంప్రెసర్‌తో ఎయిర్ కండీషన్ ఒకటి తయారు చేయాలి అనుకున్నాడు. అలా కొన్ని ప్రయోగాలు చేసి తన ప్లాస్టిక్ యంత్రానికి కూలీల సమస్య తలెత్తకుండా ఒక కన్వేయర్ అవసరమైంది. అలా ఎన్నో ప్రయోగాలు చేసి తన యంత్రానికి ముడి ప్లాస్టిక్ సరఫరా చేసేలా స్వయంగా ఒక యంత్రాన్ని తయారు చేసుకున్నాడు. ఈ యంత్రం పూర్తిగా కంప్రెసర్ సహాయంతో పని చేస్తుంది. ఈ యంత్రం నీటి పంపు లాగా ప్లాస్టిక్ ముడి పదార్థాన్ని కంప్రెసర్ సహాయంతో గుంజుకుని ఒక గొట్టం గుండా ప్లాస్టిక్ మౌల్డింగ్ యంత్రంలోకి పోస్తుంది. అంటే నీటిని తోడినట్లు ప్లాస్టిక్ గింజలను యంత్రంలోకి తోడేస్తుంది. ఈ ప్లాస్టిక్ గింజలు దాదాపు మొక్కజొన్న విత్తనాల పరిమాణంలో వుంటాయి. ఇది గంటకు ఒక టన్ను ముడిసరుకును లాగేసి యంత్రానికి అందిస్తుంది. ఆ యంత్రం తనకు బాగానే పని చేయటం, కూలీల ఖర్చు కాస్త తగ్గటంతో అతనికి ఇలాంటి యంత్రం 'రైస్ మిల్లర్లకు' బాగా అవసరం వుంటుంది కదా అని తనకు తెలిసిన ఒక రైస్‌మిల్ యజమానికి తన యంత్రాన్ని చూపించాడు. ఇది మీకు బాగా ఉపయోగ పడుతుంది, కూలీల ఖర్చును, శ్రమను కూడా తగ్గిస్తుంది కదా అని తన యంత్రాన్ని చూపించాడు. వారు ఈ యంత్రం బాగానే వుంది, ఇలాంటిది మాకూ అవసరమే కానీ, ఇంతకన్నా పెద్ద యంత్రం కావాలి. రైస్ మిల్లులో యంత్రాలు చాలా ఎత్తుగా వుంటాయి కాబట్టి క్రింద నుండి అంత ఎత్తు వరకు చేరవేసేలా తయారు చేయగలిగితే ప్రతి రైస్‌మిల్లు యజమాని దీన్ని కొనుగోలు చేస్తాడు అని సలహా ఇచ్చాడు.

సరే దీన్ని ఎలాగైనా తయారు చేయగలిగితే తనకు మంచి గిరాకీ వుండేలా వుంది అనుకున్నాడు. తన కర్మాగారంలో ప్లాస్టిక్ ముడిసరుకు తోడుకోవటానికి ఒక పెద్ద


అదే సాంకేతికతతో రైతుల ధాన్యాన్ని తోడేందుకు రూపొందిస్తున్న యంత్రం

కంప్రెసర్‌ను ఏర్పాటు చేసుకోవటం వల్ల ఈ యంత్రం సైజు చిన్నదిగా వుంది. కానీ రైస్ మిల్లర్లకు మళ్ళీ ప్రత్యేకంగా ఎయిర్ కంప్రెసర్ కొనాల్సిన అవసరం లేకుండా కేవలం యంత్రం ఆడిన వెంటనే అందులోనే ఒత్తిడి ఉత్పత్తి అయి మిల్లులోకి వడ్లను తోడివేసేలా తయారు చేశాడు. తాను అనుకున్నట్లు గానే యంత్రం తయారు కావటంతో దాన్ని ఆ మిల్లు యజమాని కొనుగోలు చేసి తన తోటి మిల్లు యజమానులకు కూడా దీన్ని సిఫారసు చేస్తున్నాడు.

ఈ యంత్రం 20 అడుగుల దూరం నుండి గింజలను లాక్కోగలదు, 50 అడుగులకు పైగా గింజలను తోడివెయ్యగలదు. రైస్ మిల్లుకు లారీల్లో, ట్రాక్టర్లలో వడ్లు వస్తూ వుంటాయి. వాటిని ఒకటి రెండు రోజులు ఆరుబయట ఆరబెట్టి, ఆ తర్వాత మిల్లు పడుతూ వుంటారు. ఈ పనికి ఎక్కువ మంది హమాలీలు, కూలీలు అవసరమౌతారు. ఈ యంత్రం కొనుగోలు చేస్తే ఆ ఖర్చు 20 శాతానికి తగ్గిపోతుంది. అంటే 10 మంది చేసే పని కేవలం ఇద్దరితోనే అయిపోతుంది. ఈ యంత్రం ఎక్కడికైనా తోసుకు వెళ్ళే విధంగా చక్రాలు అమర్చబడి వుంటుంది. అంటే రైస్ మిల్లులోకి వడ్లు వేసుకుని లారీ వచ్చిందంటే వాటిని లారీనుండి బయలు ప్రదేశంలో ఆరబెట్టడానికి దీని సహాయంతోనే పొయ్యవచ్చు. వడ్లు ఆరిన తర్వాత అక్కడినుండే నేరుగా మిల్లులోకి తోడివెయ్యవచ్చు. మార్కెట్ యార్డుల్లో కూడా ఇలాంటి యంత్రాలను ఉపయోగించుకున్నట్లయితే హమాలీల ఖర్చు విపరీతంగా తగ్గిపోగలదు.

ఈ ప్రయోగాత్మక యంత్రం విజయవంతంగా పని చెయ్యటంతో ప్రస్తుతం పెద్ద పెద్ద కర్మాగారాలు, కాఫీ గింజల కర్మాగారాల వారు కూడా తమకూ తయారు చేసి ఇవ్వమని ఆర్డర్లు ఇస్తున్నారు. ఇదే యంత్రాన్ని రైతులకు కూడా ఉపయోగ



ఇక్కడినుండి తన యంత్రానికి తోడుతున్న ప్లాస్టిక్ ముడిసరుకు



రైస్ మిల్లుల్లో ఉపయోగిస్తున్న వడ్లు, బియ్యం తోడే యంత్రం

పడేలా చిన్న సైజులో కూడా తయారు చేశాడు. దీన్ని గ్రామాల్లో మొక్కజొన్న, ప్రొద్దుతిరుగుడు, జొన్న, సజ్జ లాంటి గింజలను నూర్పిడి చేసే యంత్రాల ప్రక్కనే ఈ చిన్న యంత్రాన్ని బిగించుకోగలిగితే ఆ రైతుకు నూర్పిడి చేసిన ధాన్యాన్ని కూడా నేరుగా ట్రాక్టరు లేదా ఎద్దుల బండిలోకి తోడివేయవచ్చు.

ప్రస్తుతం చాలామంది నుండి ఆర్డర్లు వస్తున్నాయి, వాటిని తయారు చేసే పనిలో నిమగ్నమై వున్నాడు ఉదయభాస్కర్. రైతాంగం కోసం ఇంకా తక్కువ ఖర్చుకే ఈ యంత్రం తయారయ్యేలా ప్రయోగాలు చేస్తున్నాడు. కానీ, పరిపూర్ణంగా ఈ పని చెయ్యాలంటే కొంత పెట్టుబడి అవసరం అవుతుందని, కానీ అతి త్వరలోనే రైతులకు అవసరమైన ధాన్యం తోడే యంత్రాన్ని తయారు చేసి అందివ్వగలనని ధీమా వ్యక్తం చేశాడు ఉదయ భాస్కర్. ఇతని కల త్వరలోనే సాధ్యమై రైతాంగానికి ధాన్యం నూర్పిడి అయిన తర్వాత వాటిని ఇంటికి లేదా మార్కెట్‌కు చేర్చుకోవడంలో అయ్యే ఖర్చు గణనీయంగా తగ్గిస్తాడని ఆశిస్తోంది 'పల్లెసృజన'. ఎన్.ఐ.ఎఫ్.తో సంధానం చేసి ఉదయభాస్కర్ రైతులకు చేస్తున్న సేవలకు జాతీయ స్థాయిలో గుర్తింపు రావాలని ప్రయత్నం చేస్తున్నది.

**ఉదయ భాస్కర్ ఫోన్ నెం.: 9440069042**



# నన్నం తిరుపతిరావు సృజనాత్మక శిక్షణ

- జమ్మలమడక శశిమోహన్
- పల్లె వీరరాఘవ రెడ్డి

'జ్ఞానం' ఎంతటి గుర్తింపు తెస్తుందో అన్నదానికి ప్రత్యక్ష ఉదాహరణ మన ఇన్నోవేటర్ ప్రకాశం జిల్లా, చీరాలకు చెందిన 'నన్నం తిరుపతి రావు' గురించి పల్లెసృజన పాఠకులకు విదితమే. విద్యుత్ స్తంభాలను ఎక్కి రోజువారి కూలీగా రిపేర్లు చేసే తిరుపతి తన జ్ఞానంతో విద్యుత్ స్తంభాలను ఎవ్వరైనా చిన్నపాటి సాధనంతో చకచకా ఎక్క గలిగేలా తన సృజనాత్మకతతో 'విద్యుత్ స్తంభాలు ఎక్కే చెప్పులు' తయారు చేయటం వల్ల మన ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనే కాక, జాతీయ, అంతర్జాతీయ స్థాయి ఖ్యాతిగడించాడు. ఇటీవల అంతర్జాతీయ స్థాయిలో మొదటి బహుమతి గెలుచుకొని వచ్చిన విషయం గత సంచికలో మీరు చదివే వుంటారు. ఇప్పుడతను యావత్ భారత దేశానికే కాక, కొన్ని అంతర్జాతీయంగా కూడా ఆ పరికరాలను సరఫరా చేయటం జరిగింది.

'పోల్ క్లయింబర్' తయారు చేయటం, వాటిని ఉపయోగించే విధానాన్ని సోషియల్ మీడియా ద్వారా ఎప్పటికప్పుడు తెలియజేయటంతో ఇప్పటికే దాదాపు యావత్ దేశానికి సుపరిచితుడు అయిపోయాడు. దీని ద్వారా ప్రస్తుతమున్న సాంకేతికతను వినియోగించుకోవటంలో కూడా తిరుపతి ముందున్నాడని చెప్పవచ్చు.

ఈ క్రమంలో తిరుపతిని చాలామంది తమకు కరెంటు స్తంభాలను ఎక్కేందుకు శిక్షణ ఇవ్వమని కూడా అడిగారు. కానీ తన పోల్ క్లయింబర్ ను తీసుకుంటే ఎవ్వరైనా సులభంగా ఎక్కవచ్చు అని చెపుతూ వచ్చాడు. ఆ సమయంలో తాను తయారు చేసిన పరికరాలను వివిధ విద్యుత్ శాఖల అధికారులను, కలెక్టర్లు, అధికార పార్టీ నాయకులను కలిసి తన పరికరాలను అమ్ముకుంటే బావుంటుంది అనే ఆలోచనలో వుండేవాడు.

ఇతని ఆలోచన అంతటితో ఆగలేదు. గ్రామాల్లో ఇంకా సరియైన శిక్షణ లేక విద్యుత్ అంతరాయాలను ప్రజలు ఎదుర్కొంటూనే వున్నారు, సరియైన శిక్షణ ఇవ్వ గలిగితే ప్రతి



గ్రామంలో ఒక వ్యక్తి తయారై ప్రజలకు త్వరితగతిన సేవలు అందిస్తారని ఆలోచించాడు. అంతే కాదు ఇలా ప్రతి గ్రామంలో కొందరు యువకులను తయారు చేయ గలిగితే వారే తన పరికరాలను అమ్మేందుకు ఉపయోగ పడతారు అనుకున్నాడు. అందుకు తానే 'శిక్షణా తరగతులు' ఏర్పాటు చేసి యువకులకు స్వయం ఉపాధి లేదా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే బావుంటుంది అనుకున్నాడు. పైగా వివిధ జిల్లాలు, రాష్ట్రాల నుండి 'పోల్ క్లయింబింగ్ లో ట్రైనింగ్' ఇవ్వమని వందలాది మంది ఫోన్‌లు చెయ్యటంతో అతనికి ఈ ఆలోచన వచ్చింది.

అంతే కాక 'పల్లెసృజన' ద్వారా ఏర్పాటు చేయబడ్డ వివిధ ప్రదర్శనల్లో కూడా ఇదే విధంగా అభ్యర్థనలు, సూచనలు వచ్చేవని గ్రహించి మొత్తానికి "నన్నం పోల్ క్లయింబింగ్ ట్రైనింగ్ సెంటర్" ని ప్రారంభించాడు. తిరుపతిరావు ప్రారంభించటానికి ముందే కర్నాటకలో ఒకచోట, తెలంగాణ రాష్ట్రంలో ఒకచోట ఇలాంటి శిక్షణా సంస్థలు వున్నట్లు తెలుసుకుని వారి వద్ద శిక్షణ పొందిన వారి వివరాలు కనుక్కొని వారితో మాట్లాడటం జరిగింది. వారు తమ శిక్షణ పట్ల పెద్దగా సంతృప్తిని వ్యక్తం చేయలేదని గ్రహించాడు. శిక్షణ పూర్తయినా ఇప్పటికీ కరెంటు స్తంభాన్ని ఎక్కడానికి రావటం లేదు అన్న సమాధానాలే విన్నాడు. ఈ సమస్యలన్నిటికి సమాధానంగా



తన శిక్షణ వుండాలని నిర్ణయించుకున్నాడు తిరుపతి.

తన శిక్షణలో ప్రధానంగా కరెంటు స్తంభాన్ని



ఎక్కాలంటే విద్యార్థి తన శరీరాన్ని ఎలా ఉపయోగించాలి, ఎక్కడెక్కడ ఎలాంటి వంపులతో పని చెయ్యాలి, ఎలాంటి శారీరక వ్యాయామాలు చెయ్యాలి లాంటి ఎన్నో మెళకువలను విద్యార్థులకు అందించటం జరిగింది. ముందుగా కరెంటు స్తంభాన్ని ఎక్కాలంటే అందుకు తన శరీరాన్ని ఎలా సిద్ధం చేసుకోవాలి అన్నదానిపైనే ఎక్కువగా శిక్షణ ఇవ్వటం జరుగుతోంది. ఇలాంటి ఉపయోగకర శిక్షణ వల్ల విద్యార్థులు కూడా పరిపూర్ణమైన విశ్వాసంతో శిక్షణ తీసుకున్న తర్వాత ఆనందంగా బయటకు వెళ్తున్నారు.

ప్రారంభించిన అతి కొద్ది రోజుల్లోనే వందలాది మంది విద్యార్థులు తమ శిక్షణను పూర్తి చేసుకుని ఆయా ప్రాంతాల్లో తమ జీవనోపాధిని పొందుతున్నారు. ఇతర శిక్షణా కేంద్రాల వారు పది వేలకు పైగా ఫీజులు తీసుకుని ఇచ్చే శిక్షణను కేవలం 5 వేల రూపాయలకే ఇవ్వటం, పైగా అత్యున్నత విలువలతో కూడిన శిక్షణ ఇవ్వటం వల్ల తిరుపతిరావు శిక్షణా కేంద్రం అతి త్వరలోనే మంచి పేరును సంపాదించుకుంది. ఇతను తీసుకునే ఫీజుకు శిక్షణ ఇవ్వటంతో పాటు, శిక్షణ తీసుకునే వారు అక్కడే వుండటానికి అనువుగా వసతిని కూడా ఇస్తున్నాడు. వారు కేవలం తమ ఆహారాన్ని మాత్రం బయట తీసుకోవాల్సి వస్తుంది. శిక్షణా కాలం పది నుండి పదిహేను రోజుల వరకు వుంటుంది.

తిరుపతిరావు చేస్తున్న మరో మంచి పని ఏమిటంటే,







ఒకవేళ తన ట్రెనింగ్ సెంటర్ ను గురించి తెలియక ఇతర ట్రెనింగ్ సెంటర్‌లలో శిక్షణ తీసుకుంటున్న వారు ఆ తర్వాత తిరుపతిని గురించి తెలుసుకుని ఫోన్ చేసినా చాలు వారికి అవసరమైన సలహాలు, శిక్షణకు అవసరమైన వీడియోలు కూడా పంపటం వల్ల యువకుల్లో విపరీతమైన ఆప్యాయతను ఏర్పరచుకున్నాడు. ఈ వీడియోలు 'యు-ట్యూబ్'లో చూడాలంటే 'నన్నం తిరుపతి డు ఆర్ డై' (https://www.youtube.com/watch?v=6YTsfc97LYY&feature=youtu.be) లో చూడవచ్చు.

ఇలాంటి సృజనాత్మకమైన ఆలోచన చేయటం ద్వారా నన్నం తిరుపతి రావు తన ఇన్నోవేషన్ మార్కెటింగ్‌ను తనకు తెలియకుండానే ప్రజల చేతుల్లోకి పంపాడు అని 'పల్లెసృజన' భావిస్తోంది. తిరుపతిరావు చేసింది ఇన్నోవేషన్ మాత్రమే కాదు తనకు తెలియకుండా తన పరికరాలను కొనేందుకు వినియోగదారులను తయారు చేసుకున్నాడు. తిరుపతిరావు కనుగొన్న వినూత్న మార్కెటింగ్, సమాజానికి ఉపయోగ పడే పనులను ఇతర ఇన్నోవేటర్లు కూడా ఆచరించి తమ ఇన్నోవేషన్ల విక్రయాల కొరకు ఇబ్బంది పడకుండా, తమంతట తామే మార్కెటింగ్‌ను సృష్టించుకోవాలి అని సలహా ఇస్తోంది 'పల్లెసృజన'.

వ్యాపారానికి సూత్రం ఒక్కటే "సమాజానికి అవసరమైన దాన్ని గుర్తించు. ఆ అవసరాన్ని నీవు తీర్చు అదే నీ బాధ్యత, వ్యాపారం".

ఈ సూత్రాన్ని ప్రతి ఇన్నోవేటర్ గుర్తించ గలిగితే భారత దేశానికి స్వయం సమృద్ధి స్థాయికి త్వరలోనే రాగలని భావిస్తోంది 'పల్లెసృజన'. ●

# అలసిపోతున్న జ్ఞానం షేక్ హజ్రత్ వలీ



- జమ్మలమడక శశిమోహన్
- పల్లె వీరరాఘవ రెడ్డి

ప్రకాశం జిల్లా జారుగుమిల్లి మండలం లోని ఎడ్లూరుపాడు గ్రామానికి చెందిన 30 సంవత్సరాల 'షేక్ హజ్రత్ వలి' ది అపారమైన జ్ఞానం. తండ్రి మీరా సాహెబ్ టైలరింగ్ వృత్తితో జీవనం సాగించేవాడు. 8 తరగతి వరకు మాత్రమే చదువుకున్న హజ్రత్ వలి ఆ తర్వాత మెకానిక్ పని నేర్చుకోవడం జరిగింది. పుట్టి పెరుగుతున్నది పల్లెటూరు కావటంతో గ్రామీణ వాతావరణం అంటే చాలా ఇష్టం. అందునా వ్యవసాయం చేసేవారంటే ఇంకా ఇష్టం. గ్రామాల్లో పూరి గుడిసెలు, పచ్చని పంటలు, చెట్లు, ఎడ్ల బండ్లు లాంటి వాతావరణం ఎంతో ఇష్టమంటాడు వలి.

మెకానిక్ పని బాగా నేర్చుకున్న తర్వాత తన గ్రామంలోనే, తన ఇంటివద్దనే ఒక చిన్న వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. ఈ వర్క్‌షాప్‌లో గ్రామీణులకు, రైతులకు అవసరమైన పనిముట్లను చేయటమే కాదు, వారి మోటార్ సైకిళ్ళను కూడా రిపేరు చేయడం అలవోకగా నేర్చుకున్నాడు. ఇతనిది ప్రస్తుత పరిభాషలో చెప్పాలంటే 'మల్టీ పర్పస్ వర్క్‌షాప్'. ఇందులో లేత్ మిషన్, వెల్డింగ్, బైక్ మెకానిజంలతో పాటు ఆఖరుకు మోటార్ సైకిళ్ళకు పంచర్‌లు కూడా తనే చేస్తాడు.

రైతులకు లేదా గ్రామీణులకు ఎవరికైనా సరే తమ అవసరాలను తీర్చే కొత్తదనం గల పరికరాలు తయారు చేయటం అంటే వలీకి ఎంతో ఇష్టం. అలాంటి పనులు చెయ్యటంలో వున్న తృప్తే వేరు అంటాడితను. అలా రైతులకు అవసరమైన కొత్త కొత్త, చిన్న పరికరాలు చేసి ఇస్తూ వుండేవాడు. ఇప్పటికే ఏడెనిమిది రకాల చిన్న చిన్న చేతితో పని చేసే పరికరాలను చేసి ఇచ్చాడు. అందులో చిన్నదిగా వున్న కలుపు తీసే పరికరం, పెద్ద పెద్ద దుబ్బులు, చిన్నపాటి చెట్లను పెకిలించి కలుపు తీసే పరికరం, చిన్న కమతాల్లో పొలంలో అంతర సేద్యాలు చేసుకునే వారికి అనువైన పరికరాలు వున్నాయి.

ఈ పరికరాల పనితనాన్ని చూసిన ఆ గ్రామ రైతులు ఇతని తెలివి తేటలకు ముగ్ధులై అతనితో.... 'ప్రస్తుతం ఎద్దులు లభించటం చాలా కష్టంగా మారుతోంది. ఎవరెవరో ఎన్నో రకాల అంతర సేద్యాలు చేసుకునేందుకు టిల్లర్లు చేస్తున్నారు కదా నీవు కూడా ఒకటి ఏదైనా తయారు చేసి ఇవ్వు' అని కోరారు. దానికి హజ్రత్ వలీ సరేనని ఒప్పుకొని ఒక పాత మోటార్ సైకిల్ ఇంజన్‌తో తన మేధస్సును ఉపయోగించి అంతర సేద్యాలకు అనువైన వీడర్‌ను రూపొందించాడు. మోటార్ సైకిల్ మెకానిజంలో కూడా అనుభవం వుండటంతో ఆ టిల్లర్‌ను తయారు చేయటంలో పెద్దగా ఇబ్బందులేమీ లేకుండానే మొదటి విడతలోనే విజయం సాధించాడు.



రైతులకు వీలైనంత తక్కువ ధరలో, ఎక్కువ పని చేసి పెట్టేదిగా వుండాలన్నదే వలీ అభిప్రాయం. రైతు ఒక్కో పనికి ఒక్కో యంత్రం కొనుగోలు చేయాలంటే సాధ్యం కాదు కాబట్టి ఒక్క యంత్రం కొంటే వీలైనన్ని పనులు దానితోనే చేసుకునేలా రూపొందించాడు. అంతే కాదు గ్రామంలోని మెకానిక్ షాపు కాబట్టి పెద్దగా రద్దీగా వుండదు కాబట్టి ఖాళీ సమయం దొరికినప్పుడల్లా తాను కూడా పొలానికి వెళ్ళి వాటితో పొలాన్ని దున్నటం లాంటి పనులు చేస్తుంటాడు. ఇలా చేయటం వల్ల అందులో కూడా ఏవైనా లోపాలు ఉంటే మరో పరికరం తయారీలో అలాంటి లోటుపాట్లు లేకుండా సరిచేసుకోవడం ఇతని నైజం.

తనవద్దకు రైతు ఒక ట్రాక్టరు లేదా నడుచుకుంటూ పనిచేసే వీడరు ఏది తెచ్చి, తనకు ఇందులో మరో పని చేసుకునే వెసులుబాటు అంటే ఉదా.: పురుగు మందు పిచికారి చేసే ఏర్పాటు చేసి ఇవ్వమంటే చేసి ఇస్తాడు. అందుకే ఇతను గ్రామంలో రైతులకు బాగా కావాల్సిన వాడయ్యాడు. ఒక్కో వీడర్ కొరకు ప్రత్యేకంగా సమీప పట్టణం నుండి కావలసిన సామాన్లు తీసుకు రావటం వల్ల కొంత ధర ఎక్కువ కావడం, రైతు కొంచెం నిరాశ పడటం జరుగుతుంది. ఎవరైనా సహృదయంతో ఆర్థిక సహకారం అందిస్తే ఒక్కో పరికరం, యంత్రం కాకుండా నాలుగైదు తయారు చేసి పెట్టుకున్నట్లయితే నేను కొనుగోలు చేసి, ఇక్కడికి రవాణా చేసుకు రావటం ఖర్చు చాలా వరకు మిగిలిపోవటం వల్ల రైతుకు కూడా తక్కువ ఖరీదుకే అందించ గలనని అంటున్నాడు. అవసరమైన సామాన్లు ఎక్కువగా తీసుకుని వచ్చి తనవద్ద స్టాకు పెట్టుకునేంత స్థోమత తనకు లేదని వాపోతున్నాడు వలీ.

ఇతను ఒక వీడర్ తయారు చేస్తే రైతు ఆ యంత్రం తోనే సేద్యం చేసుకోవటం, పురుగు మందులు పిచికారి చేసుకోవటం, అంతర సేద్యాలు చేసుకోవడం, ట్రాలీ కూడా ఏర్పాటు చేసి ఇస్తాడు కాబట్టి ఎద్దుల బండిలాగా ఉపయోగ పడుతుంది. ఇంకా ఏవైనా రైతు అవసరాలను కూడా దీనితోనే





తీర్చుకునేలా ఈ యంత్రాన్ని తయారు చేయగలిగే ఆలోచనలు నాకు చాలా వున్నాయి అంటున్నాడు హజ్రత్ వలీ. ప్రస్తుతం ఒక్కో పరికరం, యంత్రం మాత్రమే అప్పుడప్పుడూ వచ్చే ఆర్డర్లతో పని చేసుకుంటూ వెళ్తుంటే ఇది తన భుక్తికి మాత్రమే సరిపోతోందని, పెట్టుబడి పెట్టే స్థోమత తనకు లేకపోవటం వల్ల రైతుకు తక్కువ ధరలో అందించలేక పోతున్నాను అని వాపోయాడు వలీ.

ఇదిలా వుండగా హజ్రత్ వలీ ఎంతో ఆలోచించి, సృజనాత్మకంగా తయారు చేసిన యంత్రాలు, పనిముట్లను ఇతర ప్రాంతం వారు వచ్చి వాటిని చూసి, ఫొటోలు తీసుకు వెళ్ళి వాటిని కాపీ చేసి అమ్ముకుంటున్నారని. ఇటువంటి వారి పట్ల భయమేసి ఒక్కో పరికరం చేయటమే మానుకోవాలి అనిపిస్తుందని అసహనం వ్యక్తం చేయటం బాధకరం.

వలీ అంతకు ముందే ఎన్నో చిన్న చిన్న పరికరాలు తయారు చేశాడు. వాటిలో సునాయాసంగా చిన్న పరికరాన్ని ఒకే మనిషి తోసుకుంటూ వెళ్తే చాలు పొలంలో కలుపు సులభంగా తీసివేయవచ్చు. ఇలాంటి కలుపు తీసే చిన్న చిన్న పరికరాలు ప్రస్తుతం రైతులకు ఎంతో ఉపయోగకరం.





ఇలాంటి వాటిని చాలామంది ఇన్నోవేటర్లు తయారు చేస్తున్నా, ఒక్కో పరికరం ఒక్కో రైతు వినియోగించుకునేందుకు సులభంగా వుంటుంది. వారికి నచ్చిన వాటిని కొనుగోలు చేస్తారు. ఏదియేమైనా ప్రస్తుతం రైతులకు ఖర్చు మిగల్చడమే ఇన్నోవేటర్ల ప్రధాన ధ్యేయంగా మారాల్సిన అవసరం ఎంతైనా వుంది.

అంతే కాక ఎన్నో రకాల చేతి పనిముట్లను హజ్రత్ వలీ తయారు చేశాడు. వాటిలో మరో చేతి పరికరం మొక్కలను నాటేందుకు గొయ్యి త్రవ్వేది. మరీ చిన్న కమతాల వాళ్ళు స్వయంగా తామే తమ పొలాన్ని పంట విత్తుకోవడానికి సిద్ధం చేసుకోవడానికి అవసరమైన పనిముట్లు ఎన్నో వున్నాయి. తనకు తగిన ఆర్థిక సహకారం అందించ గలిగితే రైతుకు అవసరమైన, గ్రామీణుడికి అవసరమైన ఎలాంటి పనిముట్టునైనా తయారు చేసే ఆలోచన తనకుందని. తనలాంటి వారి ఆలోచనలను వినియోగించుకునేలా తనకు ప్రభుత్వమో, స్వచ్ఛంద సంస్థలో సహకరిస్తే తనేంటో, తన పనితనమేంటో నిరూపిస్తానని అంటున్నాడు.

గత 5–6 సంవత్సరాలుగా ఇన్నోవేషన్లు చేస్తున్నా, రైతులకు అవి చాలా లాభకరంగా వున్నా ఆర్థిక స్థోమత లేక ఈ యువ ఇన్నోవేటర్లు నిరాశతో ఉన్నారు. ఇలాంటి వారిని కాపాడుకోవడం సామజ బాధ్యత. ప్రతి గ్రామంలో అవసరాలకు తగిన ఆవిష్కర్తలు వాటిని ఉత్పత్తి చేస్తే, స్థోమత ఉంటే ఆ గ్రామాల ప్రజలకు ఖర్చులు తగ్గుతాయి. పరికరాలతో ఉత్పాదకత పెరుగుతుంది. స్థానికంగా అందుబాటులో ఉంటే తక్కువ ఖర్చులతో గ్రామ ప్రజలు లాభాలు సాధిస్తారు. అభివృద్ధిని అనుభవిస్తారు. ●

# పల్లెసృజన 'కుటుంబ సమావేశం'



'కుటుంబం' అంటే మనకు తెలిసింది సంబంధ బాంధవ్యాలతో, రక్త సంబంధంతో ముడిపడిన సభ్యులున్న సమూహం. 'పల్లెసృజన కుటుంబం' వైవిధ్యంగా, అతి సన్నిహితంగా, రక్త సబంధాలు లేని సభ్యులతో కూడినది. 'కుటుంబం' శబ్దానికి ఒక కొత్త నిర్వచనం 'పల్లెసృజన కుటుంబం'. ఇన్నోవేటర్లు కేంద్రంగా, వాలంటీర్లు, కో–ఆర్డినేటర్లు, శ్రేయోభిలాషులు కలసి ఒకే గమ్యం సాధించడానికై తయారైన సమూహం ఈ 'పల్లెసృజన కుటుంబం'. జ్ఞానం, క్రియాశీలత ఎక్కడైనా ఉంటుంది. దానికి చదువు, ఆర్థిక స్థోమత, పదవులు, అవసరాలు కావన్న విశ్వాసంతో పల్లెసృజన కుటుంబం గత పదిహేనేళ్ళుగా 'ఇంతింతై వటుడింతై' అన్నట్లుగా పెరుగుతూ వచ్చింది. వర్గ విభేదాలు, కులమతాల ఆలోచనలకు దూరంగా 'క్రియాశీలత – జ్ఞానం' ఆధారంగా పల్లెసృజన కుటుంబం ప్రారంభమై ఆనందంగా తెలుగు రాష్ట్రాల్లో విస్తరిస్తున్నది. వీరందరి కలయికే 'పల్లెసృజన కుటుంబం సమావేశం'. ఫిబ్రవరి 8–9 తేదీలలో హైదరాబాద్ తార్నాకలోని సత్యోదయం రిట్రీట్ ప్రాంగణంలో జరిగింది. కుటుంబ సభ్యులు దాదాపు 100 మంది వరకు పాల్గొన్నారు. ఇది నాలుగవ పల్లెసృజన కుటుంబ సమావేశం.

**మొదటి రోజు :**

8 ఫిబ్రవరి ఉదయం అల్పాహారం పూర్తి చేసిన తర్వాత సత్యసదన్‌లోని సమ్మేళన కక్ష్యలో కుటుంబ సమావేశం ప్రారంభమైంది. ప్రథమంగా పల్లెసృజన స్థాపనాధ్యక్షులు బ్రిగేడియర్ గణేశం గారు గత 15 సంవత్సరాల్లో పల్లెసృజన ప్రయాణం, మైలు రాళ్ళు, కుటుంబ అభివృద్ధి, ఇన్నోవేటర్లను వెతకడం, వారిని సమాజంతో సంధానం చేయడం, వారికి జాతీయ స్థాయి గుర్తింపులు, పేటెంట్లు సాధించడం, వాలంటీర్ల సహాయంతో ఇన్నోవేషన్ల ప్రదర్శనలు దేశమంతా చేపట్టడం, పాఠశాల విద్యార్థుల జ్ఞానాన్ని దేశ స్థాయికి తీసుకు వెళ్ళి వారికి రాష్ట్రపతి ద్వారా గుర్తింపు సాధించడం, ఇన్నోవేటర్లకు ఆర్థిక సహాయాలు అందించడం, కళాశాల విద్యార్థులకు గ్రామీణ ఇన్నోవేటర్ల ప్రతిభతో అనుసంధానం చేయడం, తద్వారా వారు గ్రామాలను సందర్శించి అక్కడి సాంకేతిక సమస్యలను సంపూర్ణంగా అవగాహన చేసుకుని పరిష్కారాలను తయారు చేయడం, స్థానిక, జాతీయ ప్రభుత్వాలను గ్రామీణ ఇన్నోవేటర్ల జ్ఞాన వ్యాప్తికై ఒప్పించడం, అనేక ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలతో పల్లె జ్ఞానాన్ని అనుసంధానం చేయడం, ప్రసార సాధనాలైన పత్రికలు, టీవీ ఛానళ్ళతో సత్సంబంధాలు,








వ్యవసాయ సంస్థలు, విశ్వ విద్యాలయాలు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో చర్చలు, పల్లెసృజన పత్రిక ప్రచురణ, చిన్న చిన్న విజయాలు, నిరాశలు, పదేళ్ళుగా ప్రజల్లోకి రాని ఇన్నోవేషన్లు, చిన్నశోధయాత్రలు, మూలికా వైద్యుల సమావేశాలు.... ఇలా కుటుంబ ప్రయాణం గురించి వివరంగా, కుటుంబ పెద్దగా వివరిస్తూ ఈ అద్భుత ప్రయాణంలో తోడుగా వున్న ప్రముఖులు దుర్గాప్రసాద్ గారు, శ్రీకర్ గారు, శర్మ గారు, శశిమోహన్ గారు, రాఘవరెడ్డి గారు, అనేక వాలంటీర్లు, సమాజంలోని శ్రేయోభిలాషులు, టిఎస్ఐసి లాంటి ప్రభుత్వ సంస్థలు – వారి పాత్రను అందరికీ తెలియజేశారు.

తదుపరి ఉపాధ్యక్షులు శ్రీకర్ గారు పల్లెసృజన సంస్థ, పత్రికా ప్రచురణ, ట్రస్టు సమస్యలు, అవకాశాలు గురించి కుటుంబ సభ్యులకు వివరించారు. ఈ అంశాలకు పరిష్కారాలు వెతకాలని వచ్చే అయిదు సంవత్సరాల్లో ఏం సాధించాలో, ఎలా చెయ్యాలో వనరుల సేకరణ, కుటుంబ సభ్యుల బాధ్యతలు – ఇవన్నీ అందరూ చర్చించాలని సూచించారు.

ఆ తర్వాత పదకొండు గంటల నుండి మధ్యాహ్న భోజనం వరకు ఇన్నోవేటర్లు తమ సమస్యలు, పల్లెసృజన పాత్ర, వారి బాధ్యతల గురించి మనసు విప్పి ఎంతో బాధ్యతగా, సమయస్ఫూర్తితో చెప్పుకున్నారు. దాదాపు 25 మంది ఇన్నోవేటర్లు తమ మనోభావాలను అందరితో పంచుకున్నారు.

వాలంటీర్లు క్రాంతి కుమార్ (పరోక్షంగా), రాజేశ్వర్ రావు, లోకేష్, తమ ఆలోచనలను, చర్చించ వలసిన అంశాలను వివరించారు. దుర్గాప్రసాద్ గారు స్థానిక ఫార్మా విద్యాలయం నుండి వచ్చిన 25 మంది విద్యార్థులకు పల్లెసృజన ఇన్నోవేషన్లను పరిచయం చేశారు. ఈ పల్లె జ్ఞానాన్ని సంస్థాగతం చేయడానికి విద్యార్థులను ప్రోత్సహించారు.

భారత గణతంత్ర దినోత్సవం 2020 నాడు భారత ప్రభుత్వం ద్వారా 'పద్మశ్రీ' బిరుదుతో గుర్తింప బడిన మన రైతు ఇన్నోవేటర్ చింతల వెంకట్ రెడ్డి 'పల్లెసృజన' కుటుంబానికి తమ ఆనందం, కృతజ్ఞతలు తెలియజేశారు.

ఉపాధ్యక్షులు శ్రీకర్ గారు వాలంటీరు ప్రశాంతి సహకారంతో ఉపస్థితులైన కుటుంబ సభ్యులను మూడు సమూహాలుగా విభజించి, అన్ని అంశాలపై కూలంకష చర్చలు జరపడానికి అవకాశం కల్పించారు. మధ్యాహ్నం మూడు గంటల నుండి ఈ మూడు గ్రూపులు రాత్రి పదకొండు గంటల వరకు చిత్తశుద్ధితో, సంస్థకు సరైన దిశను నిర్దేశించడానికి విరామం లేకుండా చర్చలు జరిపారు. ప్రతి ఇన్నోవేటర్ ఏ స్థాయి వారైనా, పల్లెసృజన సంస్థపై వారికున్న ఆత్మీయత, ప్రేమ, అందరితో కలసి ఇంకా ఎంతో సాధించాలన్న తపన, పల్లెసృజన 'నాది' అన్న ఆలోచనతో కో–ఆర్డినేటర్లు కళ్ళు చెమర్చేలా మమేకమై పాల్గొన్నారు. అదొక అద్భుత దృశ్యం. అపురూప కార్యం.

**రెండవ రోజు :**

ఉదయం పదిన్నర వరకు అసంపూర్తిగా ఉన్న సమూహ చర్చలు జరుగుతునే ఉన్నాయి. పదకొండు గంటల నుండి మధ్యాహ్న భోజనం వరకు మూడు గ్రూపులు తమ చర్చల సారాంశాన్ని, పల్లెసృజన స్థిరంగా ముందుకు





వెళ్ళడానికి మరెంతో మంది ఇన్నోవేటర్లను కుటుంబంలో కలపడానికి, పత్రిక సభ్యత్వం పెంచడానికి, డిజిటల్ ప్రపంచంలో మరింత ముందుకు వెళ్ళడానికి, ఆర్థిక బాధ్యతలు అందరూ పంచుకోవడానికి, ఇన్నోవేషన్లను విస్తృతం చేయడానికి, ఇంకా మరెన్నో అంశాలకు సరియైన, సాధ్యమయ్యే పద్ధతులను, బాధ్యతలను, మార్గాన్ని చక్కగా వివరించి చెప్పారు. పటాన్ సైదా ప్రతి ఇన్నోవేటర్ నెలకొకసారి దగ్గరి ఊరికి వెళ్ళి 'పల్లెసృజన' సంస్థ గురించి వారికి పరిచయం చేయాలని సూచించారు. చాలామంది ఇన్నోవేటర్లు పల్లెసృజన పత్రిక సభ్యత్వాన్ని పెంచడానికి ముందుకొచ్చారు. కుటుంబ సమావేశం ప్రతి మూడు నెలలకోసారి జరపాలని చాలామంది సూచించారు. ప్రదర్శనల్లో పాల్గొనడం ప్రధానమని, ఇన్నోవేటర్లు దీనికై కొంత త్యాగం చెయ్యాల్సి వస్తుందని తెలియజేశారు. తెలంగాణ ప్రభుత్వ సంస్థ టి.ఎస్ఐ.సి. ద్వారా, ఆంధ్రప్రదేశ్ శాసన సభ్యులు శ్రీ కాటసాని రాంభూపాల్ రెడ్డి ద్వారా పల్లెసృజన రెండు రాష్ట్రాల ప్రభుత్వాలతో భాగస్వామ్యాన్ని పెంపొందించాలని కోరారు.

వాలంటీరు, క్రియేటివ్ మైండ్స్ బాధ్యతలు చూస్తున్న సుభాష్ చందర్ ఇన్నోవేషన్ల ప్రదర్శనకు తాము చేస్తున్న కృషి, సాధక బాధకాలు పంచుకున్నారు. ఈ ప్రదర్శనలు వారానికి కనీసం ఒకటైనా జరుగుతున్నాయని, వీటి ప్రాధాన్యతను, ప్రజల్లోకి పల్లెజ్ఞానం వెళ్ళడానికి ఇవి ఏవిధంగా ఉపయోగ పడుతున్నాయో వివరించారు. ఇవన్నీ గుర్తించి ఇన్నోవేటర్లు పూర్తి సహకారం అందిస్తారని, తద్వారా ఎక్కువ మంది ప్రజలు ఇన్నోవేషన్లను కొనే అవకాశాలుంటాయని వక్కాణించారు. రాఘవ రెడ్డి 'పల్లెసృజన'తో తనకున్న 15 సంవత్సరాల అనుబంధాన్ని, తన సలహాలను అందరితో పంచుకున్నారు. ప్రతి ఇన్నోవేటర్ ఇతరుల ఇన్నోవేషన్లను కూడా అమ్మడానికి పూర్తి ప్రయత్నం చేయాలని కోరారు.

ఈ రెండు రోజుల సమావేశానికి కుటుంబ సభ్యులు తమ స్వంత ఖర్చులతో ఎంతో బాధ్యతాయుతంగా హైదరాబాద్ వచ్చి, తిరిగి వారి ఖర్చులతోనే తమ ఇంటికి చేరుకున్నారు. వసతి, భోజన ఖర్చులకై ఇన్నోవేటర్లు, వాలంటీర్లు, శ్రేయోభిలాషులు స్వచ్ఛందంగా ఆర్థిక సహాయం చేశారు. ఖర్చుకంటె రెండు రెట్లు జమ అయిన ఈ మొత్తాన్ని పల్లెసృజన సంస్థ నిర్వహణకు, పత్రిక ప్రచురణకు వినియోగించాలని కుటుంబం నిర్దేశించింది. తమ ఆర్థిక స్థితిని మించి కుటుంబానికి సహాయం చేసిన మన ఇన్నోవేటర్లు అసామాన్యులు. వారు అందరికీ ఆదర్శం.

వాలంటీర్ సుభాష్ చందర్ ఆధ్వర్యంలో వసతి, భోజన సదుపాయాలు, స్వాగత, వీడ్కోలు ఏర్పాట్లు, సభాస్థలిలో వసతులు వాలంటీర్లు లోకేష్, శ్రీకాంత్, శివ, సాయి, హరీశ్, నవీన్, ఓంకార్, అఖిల, ప్రశాంతి, హారిక, లక్ష్మీ ఇతరులు అద్భుతంగా సమకూర్చారు. సత్యసదన్ వారి సహకారం గమనార్హం.

మొదటి రోజున మాట్లాడని ఇన్నోవేటర్లు కుటుంబ సభ్యులను ఉద్దేశించి వారి మనసులోని భావాలను





**'పల్లెసృజన కుటుంబం'లో వికసించిన రెండు 'పద్మాలు'**

పల్లెసృజన కుటుంబ సమావేశంలో 'పల్లెసృజన' ద్వారా వెలుగులోకి వచ్చిన ఇద్దరు 'పద్మశ్రీ' పురస్కార గ్రహీతల ఉపస్థితి ఇన్నోవేటర్ల కళ్ళల్లో వెలుగును తెచ్చింది. 'పద్మశ్రీ' గ్రహీతలు 'చింతకింది మల్లేశం' మరియు 'చింతల వెంకట్ రెడ్డి' గార్లు ఈ సమావేశానికి రావడంతో ఇన్నోవేటర్లు అందరికీ కొత్త ఉత్సాహాన్ని తీసుకు వచ్చింది.

పంచుకున్నారు. దీంతో సమావేశానికి వచ్చిన ప్రతి ఇన్నోవేటర్‌కు మాట్లాడే అవకాశం కల్పించడం జరిగింది.

వ్యవసాయ శాస్త్రవేత్త డా. కల్పనా శాస్త్రి గారు తాము పల్లెసృజనతో పదిహేనేళ్ళుగా తోడుగా ఉంటున్నానని, తమవంతు సహకారం ఎప్పుడూ ఇన్నోవేటర్లకు ఉంటుందని కుటుంబ సభ్యులతో తమ భావాలను పంచుకున్నారు.

చివరగా బ్రిగేడియర్ గణేశం గారు పల్లెసృజన సభ్యులతో భవిష్యత్తు ప్రణాళికలు, ప్రభుత్వంతో చర్చలు, ఇతర సంస్థలతో కొనసాగిస్తున్న కార్యక్రమాలు, గ్రాస్‌రూట్స్ ఇన్నోవేటర్లకై పాలసీలో మార్పులు, ఆర్థిక సహాయ అవకాశాలు, విశ్వ విద్యాలయాలు, ఇంజనీరింగ్ కళాశాలలతో పొత్తులు, ఇంటర్న్‌షిప్‌లు, పల్లెసృజన కలలు మనసు విప్పి పంచుకున్నారు.

వాలంటీర్ అఖిల వందన సమర్పణతో సమావేశం ముగిసింది.

**కుటుంబ సమావేశంలో వినూత్నంగా అగుపించిన మూడు అంశాలు ...**

- ఇన్నోవేటర్లు స్వచ్ఛందంగా, ఆనందంగా, ఉత్సాహం గా కుటుంబ సమావేశ చర్చల్లో పాల్గొనడం.
- అందరూ సమానమే అన్న పల్లెసృజన స్పిరిట్/ ఫిలాసఫీ అమలు చేయడం.
- పల్లెసృజన అస్తిత్వం ఇన్నోవేటర్ల అభివృద్ధితోనే ఉన్నదన్న భావన అందరిలో స్పష్టంగా చూడడం.

ఈ అద్భుత సమావేశం వివిధ నేపథ్యాల నుండి వచ్చిన వందమంది ఇన్నోవేటర్లు నిస్వార్థంగా పాల్గొని, కలసి ముందుకు వెళ్దామన్న స్థిర నిశ్చయాన్ని దిశా నిర్దేశం చేసి స్పష్టం చేయడం ఒక కలగా ఎప్పటికీ అందరి మదిలో నిలిచిపోతుంది అనడం అతిశయోక్తి కాదేమో. ●



# గత మాసాల్లో పల్లెసృజన పాల్గొన్న వివిధ ప్రదర్శనలు - కార్యక్రమాలు




8 జనవరి,2020న మహారాష్ట్రకు చెందిన 'బుల్దానా' సంస్థ వారు తమ స్వచ్ఛంద సేవా కార్యక్రమాలకు 'పల్లెసృజన' ఇన్నోవేషన్లను తీసుకోవడం జరిగింది. వాటిని సరఫరా చేసే, వాటి పని తీరును వివరిస్తున్న సుభాష్, ఇన్నోవేటర్ ఎ.జె. రావు తదితరులు.




జనవరి 28న హైదరాబాద్ వర్ధమాన్ కళాశాలకు చెందిన 28 మంది అధ్యాపకులు 'పల్లెసృజన' కార్యాలయంలో నిర్వహించిన 'ఓరియంటేషన్ సెషన్ ఆన్ గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్స్' కార్యక్రమంలో పాల్గొన్నప్పటి చిత్రం.



పందిరి పుల్లారెడ్డిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 'రైతురత్న' బిరుదుతో వ్యవసాయ శాఖ మంత్రి చేతులమీదుగా సత్కరించిన దృశ్యం.



2020 'పద్మశ్రీ' పురస్కారం ప్రకటించిన శ్రీ చింతల వెంకట్ రెడ్డి దంపతులను తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శ్రీమతి తమిళ సై సత్కరించిన దృశ్యం.



2017లో 'పద్మశ్రీ' దరిపల్లి రామయ్య దంపతులను తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శ్రీమతి తమిళ సై సత్కరించిన దృశ్యం.



ఫిబ్రవరి 5వ తేదీ, బెంగుళూరు లో ని 'నేషనల్ హార్టికల్చర్ ఫెయిర్ - 2020' లో ఇన్నోవేటర్ సుభానిని 'ఇన్నోవేటివ్ ఫార్మర్ 2020' బిరుదుతో సత్కరించిన దృశ్యం.




ఫిబ్రవరి 22-24 తేదీలలో హైదరాబాద్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో 'అగ్రిటెక్ సౌత్ 2020' ప్రదర్శన లో భారత ఉప రాష్ట్రపతి శ్రీ వెంకయ్య నాయుడు, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ నిరంజన్ రెడ్డి గారు 'పల్లెసృజన' స్టాల్‌ను సందర్శించిన చిత్రాలు



2020 'పద్మశ్రీ' పురస్కారం ప్రకటించిన శ్రీ చింతల వెంకట్ రెడ్డి గారు 'పల్లెసృజన' స్టాల్‌ను సందర్శించిన దృశ్యం.



ఫిబ్రవరి 27-28 తేదీలలో భీమవరం విష్ణు అకాడమీలో ఏర్పాటు చేసిన 'డా. కలాం ఇన్నోఫెస్ట్' కార్యక్రమంలో జె.డి. లక్ష్మీ నారాయణ గారికి 'పల్లెసృజన' వాణి వివరిస్తున్న ఆం.ప్ర. ప్రతినిధి కృష్ణ



# జాతీయ అవార్డు పొందిన గ్రాస్‌రూట్స్ ఇన్నోవేషన్లు

- 'ఎన్.ఐ.ఎఫ్. వారి రెడీ టు సేల్' ప్రచురణ సౌజన్యంతో...
స్వేచ్ఛానువాదం : జమ్మలమడక శశిమోహన్

## మల్టి పర్పస్ ఫుడ్ ప్రాసెసింగ్ మిషన్

**సమస్య – పరిష్కారం :**

ఔషధాలకి వాడే తినగలిగిన, తినలేని పళ్ళ నుండి రసము, గుజ్జు, నూనెలు, సారము తీయటానికి, కలపటము, దంచటము, ఉడకబెట్టటము, పిండటము లాంటి అనేక ప్రక్రియలు చేయాల్సి వుంటుంది. ఔషధ మరియు ఆహార పదార్థాల తయారు చేసే సంస్థలు తమ ఉత్పత్తులను తయారు చేయటానికి దంచటానికి, కలపటానికి, ఉడకబెట్ట డానికి, ఆవిరి పెట్టి రసాలు, నూనె, గుజ్జు చేయటానికి వేర్వేరు యంత్రాలను ఏర్పాటు చేసుకుంటారు. ఇవన్నీ చేసే ఒక యంత్రం ఎక్కడా లేదు. హర్యానాకు చెందిన 'ధర్మవీర్ కాంభోజ్ అటువంటి అన్ని పనులు చేసే ఒకే యంత్రాన్ని రూపొందించాడు.



టమోట మార్కెట్ ధర ఒక్కోసారి 50 రూపాయలుంటే ఒక్కోసారి రెండు రూపాయలు కూడా పలకదు. ఇక రైతులకైతే అర్థ రూపాయికి కిలో టమోట ధర పలికిన సందర్భాలు కూడా ఉన్నాయి. అటువంటప్పుడు వీటిని నేరుగా మార్కెట్‌కు తరలించకుండా, వాటితో విలువ ఆధారిత ఉత్పత్తులను తయారు చేసుకుంటే ఎప్పుడూ మంచి రేటు లభించినట్లు అవుతుంది.

అలాగే ఉసిరి కూడా కొద్దిగా అటు ఇటుగా ఒకేసారి మార్కెట్‌కు రావటం వల్ల ధర చాలా దారుణంగా తగ్గిపోతూ వుంటుంది. అటువంటప్పుడు ఈ యంత్రం ఎంతో ఉపయోగకరంగా లాభదాయకంగా వుంటుంది.

**ఉదా.:** 1. ఈ యంత్రంలో టమోటాలను ఉపయోగించి, టమోట ఎసెన్స్, టమోట సాస్, టమోట గుజ్జు, టమోట సూప్ పొడి లను వేర్వేరుగా చేసుకుని ఎక్కువ ఆదాయాన్ని పొందవచ్చు.

2. అదేవిధంగా ఉసిరి కాయలను ఉపయోగించి ఉసిరి ఒరుగులు, ఉసిరి జామ్, ఉసిరి నూనె, ఉసిరి ఎస్సెన్స్, ఉసిరి లడ్డులను తయారు చేసుకోవచ్చు.

**పరికరం :**

తేలికగా ఎక్కడికైనా తీసుకు వెళ్ళడానికి వీలైన ఈ యంత్రం సహాయంతో అనేక రకాల పళ్ళు, కూరగాయలు,





ఔషధ మొక్కలు, విత్తనాల నుండి అనేక ఉత్పత్తులను తయారు చేసుకోవచ్చు. ఇది ప్రెషర్ కుక్కర్‌లా వేడిని నియంత్రించి, తగిన వేడి కాగానే దానంతట అదే ఆగిపోయేలా చేసే సదుపాయం కూడా ఉంది. ఔషధ మొక్కల పూలు, ఆకులను ఇందులో వేసి వాటినుండి అవసరమైన వివిధ రకాల ఉత్పత్తులను సులభంగా తయారు చేసుకోవచ్చు. యంత్రం సహాయంతో అనేక రకాల పళ్ళు, కూరగాయలు, ఔషధ మొక్కలు, విత్తనాల నుండి అనేక ఉత్పత్తులను తయారు చేసుకోవచ్చు.

**సాంకేతిక వివరాలు :**

- సింగిల్ ఫేస్ కరెంటుతో పని చేస్తుంది.
- గంటకు ఒకటిన్నర యూనిట్ల కరెంటు ఖర్చవుతుంది.
- ఈ యంత్రం 125 కిలోల బరువుంటుంది.
- దీనికి చక్రాలు ఏర్పాటు చేయటం వల్ల ఎక్కడికైనా సులభంగా లాక్కెళ్ళవచ్చు.
- దీని మోటరు 1440 ఆర్‌పియంతో పని చేస్తుంది.
- రోటరు వేగం 360 ఆర్‌పియం.
- మొదటి రకం మాడల్‌లో గంటకి 50 కిలోల రసం, రెండో రకం మాడల్‌లో గంటకి 150 కిలోల రసం తీయవచ్చు.
- రెండు హీటర్లు కలిగి, దానంతట అదే వేడిని నియంత్రిస్తూ తగినవేడికి చేరగానే ఆఫ్ అవుతుంది.

**ముఖ్యాంశాలు :**

- వేడిని నియంత్రిస్తూ ఉడకబెట్టే పద్ధతి.
- పళ్ళు, పూలు, కూరగాయలు, ఔషధ దినుసులు – మొక్కలు, ఆకులు లాంటి అనేక రకాల పదార్థాలను విలువ ఆధారిత వస్తువులుగా తయారు చేసుకోవచ్చు.
- అలోవీరను ఉపయోగించి హెర్బల్ జ్యూస్, హెయిర్ జెల్, ఫేస్ వాష్, షాంపూ, హ్యాండ్ వాష్, ఎక్స్ట్రాక్ట్‌లను తయారు చేసుకోవచ్చు.
- మామిడి పళ్ళను ఉపయోగించి, జ్యూస్, చట్నీ, జామ్ మొదలైనవి తయారు చేసుకోవచ్చు.
- ఉసిరిని ఉపయోగించి పౌడర్, హెక్స్ట్రాక్ట్ (పిప్పి), జ్యూస్, హెయిర్ ఆయిల్, జామ్, తీపి పదార్థాలు, లడ్డూలు చేసుకోవచ్చు.
- తులసి, అశ్వగంథ, శతావరి ఇతర మూలికలను ఉపయోగించి రసాలు, ఎక్స్ట్రాక్ట్ చేసుకోచవచ్చు.
- గులాబి, మల్లె, ల్యావెండర్ లాంటి పూలను ఉపయోగించి సెంటు, ఎక్స్ట్రాక్ట్ చేసుకోవచ్చు.
- వ్యక్తులు, మహిళా సమూహాలు, యువత ఉపాధి కల్పనకి ఎంతో ఉపయుక్తమైనది.
- ఆటోమేటిగ్గా పని చేస్తుంది కనుక ఆరోగ్యదాయక మైనది.
- దీన్ని ఉపయోగించి వివిధ రకాల ఉత్పత్తులను తయారు చేయటం వల్ల వృథా అనేదే లేకుండా ఆర్థికంగా లాభకరంగా ఉంటుంది.

**పురస్కారాలు :**

- 2009లో భారత రాష్ట్రపతి 5వ జాతీయ స్థాయి పోటీలలో ధరమ్‌వీర్‌ను సత్కరించడం జరిగింది.

**ఈ యంత్రాలు కావలసిన వారు సంప్రదించండి :**

**సుభాష్ చందర్, సెల్ : 96528 01700.**



# పొలాన్ని చదును చేసి అదనపు మట్టిని టిప్పర్‌లో నింపే యంత్రం



- 'ఎన్.ఐ.ఎఫ్. వారి రెడీ టు సేల్' సౌజన్యంతో...
స్వేచ్ఛానువాదం : జె. శశిమోహన్

**సమస్య – పరిష్కారం :**

చదునుగా లేని వ్యవసాయ భూములలో పంట వేయటం కష్టం. సాధారణంగా వర్షాలకు భూమి కోసుకు పోవటం ద్వారా పొలాల్లో ఎత్తు పల్లాలు ఏర్పడుతాయి. అటువంటి సందర్భాలలో ఎక్కువైన, ఎత్తుగా వున్న మట్టిని త్రవ్వి తీసి, పొలంలో తగ్గు వున్నచోట కానీ లేదా బయట వేయాల్సి వుంటుంది. ఇది చాలా ఖర్చుతో కూడుకున్న పని. దీనికి చాలామంది కూలీలు, చాలా సమయం పడుతుంది. ఈ సమస్యకి పరిష్కారంగా పంజాబ్‌కు చెందిన 'కుల్దీప్ సింగ్ మరియు రేషమ్ సింగ్'లు వేరువేరుగా భూమిని త్రవ్వి టిప్పర్లోకి నేరుగా ఎత్తి పోసే యంత్రాలను రూపొందించారు. ఈ యంత్రాలతో పొలాలను చదును చేయటమే కాక, ఎక్కువగా వున్న మట్టిని టిప్పర్‌లోకి ఎత్తి తక్కువగా వున్నచోట వేయటం కాని, లేదా బయటకు తీసుకువెళ్ళి పడవేయటం కాని సులభంగా చేసుకోవచ్చు. రైతులకు ఎంతో సమయం, ఖర్చు ఆదా అవుతుంది.

**పరికరం :**

ఈ మట్టిని త్రవ్వి టిప్పర్‌లో నింపే పరికరం ట్రాక్టర్‌కు అనుసంధానం చేసుకోవాల్సి వుంటుంది. ఇది భూమిని త్రవ్వి కన్వేయర్ బెల్టు ద్వారా నేరుగా టిప్పర్‌లోకి పంపుతుంది. ఇందులో త్రవ్వే విభాగం కాకుండా రెండు కన్వేయర్ బెల్టులు వుంటాయి. మొదటిది మట్టిని పైకి ఎత్తటానికి, ఎత్తిన మట్టిని టిప్పర్‌లోకి వేసేది రెండోది. ఇది ఒకసారి 4 అంగుళాల లోతువరకు భూమిని త్రవ్వగలదు.

**సాంకేతిక వివరాలు :**

- రెండు నిమిషాలలో 11–6–2.25 అడుగుల సైజు టిప్పర్‌ను మట్టితో నింపగలదు.
- 50 హార్స్‌పవర్ శక్తిగల ట్రాక్టర్‌కు దీన్ని అనుసంధానం చేసుకోవాల్సి వుంటుంది.





- గంటకి 5 నుండి 6 లీటర్ల డీజిలు ఖర్చవుతుంది.
- ఒకేసారి 4 అడుగుల వెడల్పులో, 4 అంగుళాల లోతు భూమిని త్రవ్వి తీసి 8.5 అడుగుల ఎత్తు నుండి టిప్పర్‌లోకి పడేయ గలదు.

**ముఖ్యాంశాలు :**

- కాలువలు త్రవ్వటానికి, రోడ్లు వేయటానికి, ఇళ్ళు కట్టడానికి ఎంతో అనువైన యంత్రం.
- సరాసరిన రోజుకి 150 టిప్పర్‌ల మట్టిని త్రవ్వి తీయగలదు.

**పురస్కారాలు :**

- 2013లో జరిగిన ఎన్ఐఎఫ్ వారి 7వ జాతీయ ద్వైవార్షిక పోటీలలో బహుమతిని ఇన్నోవేటర్లు సంయుక్తంగా పొందారు.

**కావాలనుకున్నవారు సంప్రదించండి:**

పల్లెసృజన, ఫోన్ : 040–27111959,
సెల్ : 96528 01700 (సుభాష్ చందర్)


## ఎన్.ఆర్.వి. లకు విన్నపము

ప్రతి గ్రామంలో ఎన్.ఆర్.వి. (నాన్ రెసిడెంట్ విలేజర్స్) ఉంటారు. ఉద్యోగ రీత్యా లేదా వ్యాపార రీత్యా తమ గ్రామానికి దూరంగా స్థిరపడిన వారు చాలామంది తమ గ్రామం పట్ల మక్కువ వున్నవారై వుంటారు. అటువంటి వారు తమ గ్రామం కోసం ఏదైనా ఒక మంచి పని చేయాలన్న తపన కలిగిన వారు కూడా వుంటారు. అటువంటి వారు కేవలం రూ. 1,000/–లతో 5 సంవత్సరాల పాటు తమ గ్రామానికి ఒక మంచి పుస్తకాన్ని అందిస్తే మీకు మంచి పేరు రావటం, సంతృప్తి కలగటంతో పాటు, మరుగున పడివున్న ఎన్నో ఇన్నోవేషన్లు వెలుగులోకి వస్తాయి, మరెన్నో ఇన్నోవేషన్లను గురించిన సమాచారం మీ గ్రామానికి చేరి, వారు వినియోగించుకునే సదుపాయం కలుగుతుంది.

గ్రామం నుండి వెలుపల జీవనం సాగిస్తున్న మీ మిత్రులకు ఈ విషయం తెలియజేయండి. వారు 'పల్లెసృజన' పత్రికకు చందా పంపి, ఈ పత్రిక వారి గ్రామాలకు వచ్చే ఏర్పాటు చేస్తారు. ఈ ప్రయత్నం వల్ల తెలుగు రాష్ట్రాలలోని అన్ని గ్రామాలకు త్వరలో 'పల్లెసృజన' చేరుతుందని ఆశిస్తున్నాము. – ఎడిటర్



మీ చందాను పంపవలసిన బ్యాంక్ అకౌంట్ వివరాలు :
M/s Pallesrujana, Syndicate Bank, Sainikpuri, Secunderabad.
SB A/c No. 30232200019150, IFS Code : SYNB0003023
జమ చేసిన తర్వాత మీ చిరునామాను స్పష్టంగా యస్.యం.యస్. లేదా ఇ-మెయిల్ చేయండి.
పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్, సికింద్రాబాద్ - 500 094.
ఫోన్ : 040-27111959, సెల్ : 8125799904, 9866 00 1678
E-mail : president@pallesrujana.org Visit us : www.pallesrujana.org

లేదా 'ఫోన్ పే' చెయ్యాలనుకున్న వారు 9866 00 1678 నెంబరుకు పంపి మీ చిరునామా ఎస్ఎంఎస్ లేదా వాట్స్‌యాప్‌లో పంపండి.

PhonePe

## 'సృజనాత్మకత - వ్యాపారం' అలవరచుకున్న అసామాన్యుడు

# చింతకాయల రాంబాబు



మనిషి ఎంతవరకు చదువుకున్నాడు అన్నది ముఖ్యం కాదు. చదువుకున్నది ఎంతవరకు 'వంటబట్టించుకున్నాడు' అన్నది ముఖ్యం. దాన్ని ఎంతవరకు 'ఇంటబట్టించాడు' అన్నది ఇంకా ముఖ్యం. ఇంటబట్టించడం అంటే చదువుకున్న చదువు ఇంటికి ఎంతవరకు ఉపయోగపడింది అని ప్రఖ్యాత అవధాన పండితుడు శ్రీ గరికపాటి నరసింహారావు గారి ఉవాచ.

చదువును ఇంటబట్టించడానికి పెద్ద పెద్ద డిగ్రీలు, డాక్టరేట్‌లు అవసరం లేదు అని నిరూపించాడు 46 సంవత్సరాల వయసుగల 'చింతకాయల రాంబాబు'. పుట్టింది కృష్ణా జిల్లా 'ఆగిరిపల్లి' గ్రామమైనా 20 సంవత్సరాల క్రితం అదే జిల్లాలోని 'జి-కొండూరు' మండల కేంద్రంలో స్థిర నివాసం ఏర్పరచుకొన్నాడు.

కుటుంబ ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా చదువుకోలేక పదవ తరగతితోనే చదువు ముగించాడు. ఆ చిన్న వయసులోనే తన తల్లిదండ్రుల కష్టాలను గమనించాడు. ఇతని చదువు కోసం తన తల్లిదండ్రులు వారి కష్టాన్ని ఇతనికి తెలియనివ్వకుండా వాళ్ళు కూలీ పనులు చేసుకుంటూ ఇతన్ని చదివిస్తున్నారని అర్థమైంది. అతనికి కూడా చదువుపైన పెద్దగా శ్రద్ధ లేకపోవడంతో ఇక మనకు చదువు పనికిరాదు, ఏదైనా కూలీ పని చేసి తల్లిదండ్రులకు చేదోడు వాదోడుగా వుంటే మంచిది అనుకున్నాడు. ఆ తర్వాత కొన్ని రోజులు స్థానికంగానే కూలీ పని చేసుకుంటూ ఆ యజమానుల వద్ద మంచి పేరు సంపాదించుకున్నాడు. ఇతనికి పనిపట్ల వున్న శ్రద్ధ, నిబద్ధత, మంచితనం గుర్తించిన ధర్మారావు అనే ఒకతను రాంబాబును 'ఔరంగాబాద్'కు తీసుకు వెళ్ళాడు. మొదట అక్కడ అతనికి తెలిసిన ఒక వర్క్‌షాప్ యజమాని వద్ద రాంబాబును పనిలో పెట్టాడు. షాపులో చీపురు ఊడ్చడంతో మొదలు పెట్టిన ఇతని పని దిన దినాభివృద్ధి చెంది కేవలం 6 నెలల్లోనే చిన్న చిన్న పనులన్నింటిని నేర్చుకోవడంతో పాటు, అక్కడి యజమాని వద్ద కూడా మంచి పేరు సంపాదించుకున్నాడు. రాంబాబు మంచితనమే ఇతన్ని అంచెలంచెలుగా ఎదిగేలా చేసి, తిన్నగా అక్కడి పనివారికి చేదోడు వాదోడు పనులు చేసుకుంటూ, ఎక్కువ సమయాన్ని లేత్ మిషన్ వద్ద గడపటం గమనించాడు యజమాని. పనివారు విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో తానే వారు చేయాల్సిన పనులు చేసుకుంటూ మంచి పనిమంతుడయ్యాడు.

ఇతని పట్టుదల పనిపట్ల గల శ్రద్ధను గమనించిన యజమాని రాంబాబును లేత్ మిషన్ పైన పని చేయటానికి పురమాయించాడు. యజమాని ఊహించినట్లే ఆ పనిని కూడా అతి త్వరలో నాణ్యత గల పనివాడుగా తయారయ్యాడు. ఆయా

యంత్రం తయారు కాకముందు బొగ్గును చేతితో ముక్కలు చేస్తున్న కార్మికులు



పనులు చేసే పనివారు రాత్రిపూట నిద్రవస్తోంది కాసేపు పడుకుంటాను అంటే వారి పనిని ఇతనే చేసేవాడు. కొత్త కొత్త ఆలోచనలతో ఎన్నో రకాల పనులను చేస్తూ నాణ్యత, సృజనాత్మకతతో పని చేస్తాడన్న పేరు సంపాదించుకున్నాడు. అతి స్వల్ప కాలంలోనే ఆ షాపులో వున్న అన్ని యంత్రాల పైన పనులు చేసి అన్ని పనులను ఎంతో శ్రద్ధతో నేర్చుకున్న తర్వాత ఇక తాను తన స్వస్థలానికి వెళ్ళి అక్కడ తల్లిదండ్రులను చూసుకుంటూ అక్కడే ఎక్కడో ఒకచోట పని చేసుకోవడమే లేదా స్వంతంగా ఒక షాపు ఏర్పాటు చేసుకోవడమో చేస్తానని యజమానిని ఒప్పించి స్వగ్రామానికి తిరిగి వచ్చేశాడు.

ఇక్కడికి వచ్చిన తర్వాత ఔరంగాబాద్‌లో నేర్చుకోలేని పనిని ఇక్కడ కొంత నేర్చుకుంటే ఇక్కడి వాతావరణం, పని విధానాలు తెలుసుకుంటే బావుంటుందని అనుకున్నాడు. తాను అక్కడ ట్రాక్టర్లకు సంబంధించిన పరికరాలు తయారు చేసే పని ఏదీ నేర్చుకోలేదని ఇక్కడ 'గణపతి ట్రాక్టర్ వర్క్స్' అనే ఒక వర్క్ షాప్‌లో పనికి కుదిరి, అక్కడ రెండు సంవత్సరాల పాటు అక్కడ పని పూర్తిగా నేర్చుకోవడం, ఇక్కడి పనివారు, వినియోగదారుల గురించి పూర్తిగా అవగాహన చేసుకున్న తర్వాత ఇక తన స్వగ్రామం కన్నా మండల కేంద్రంలో ఒక షాపు ఏర్పాటు చేసుకుంటే బావుంటుందని భావించి జి.కొండూరుకు తన కుటుంబాన్ని మార్చాడు.

ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి మొత్తానికి ఒక వర్క్ షాప్ ఏర్పాటు చేసుకున్నాడు. ఇతను అప్పటి వరకు నేర్చుకున్న పనిని, పనికోసం వచ్చే వినియోగ దారులను శ్రద్ధతో గమనించిన రాంబాము తనవద్దకు వచ్చే కష్టమర్ల వద్ద ప్రధానంగా ఉపయోగించిన సూత్రం ఏమిటంటే 'తమకు కావలసిన పనిని చెప్పే వినియోగ దారుడి అవసరాన్ని మొత్తం క్షుణ్ణంగా విన్న తర్వాత, వినియోగ దారుడి అవసరాన్ని బాగా అర్థం చేసుకుని, ఆ వస్తువును అతను చెప్పిన దానికన్నా ఇంకా అధికంగా, సులభంగా తయారు చేసేందుకు తనలోని సృజనాత్మకతను జోడించి పరికరం తయారు చెయ్యడం'. ఈ సూత్రం శ్రద్ధగా ఆచరించడంతో ఒక్కసారి వచ్చిన వినియోగదారుడు మళ్ళీ మళ్ళీ తన అవసరానికి ఇతని వద్దకు మాత్రమే వచ్చేలా చేసుకోవడం ఇతని వ్యాపారాభివృద్ధికి ఎంతో తోడ్పడింది.

స్వతహాగా గ్రామ వాతావరణం నుండి వచ్చిన వాడు కాబట్టి గ్రామీణుల ఆలోచనలను పసిగట్టడం ఇతనికి సులభమైంది. అందుచేత వారు కోరుకున్న దానికన్నా మిన్నగా వారి వస్తువును తయారు చేసి ఇవ్వటం ఇతని ప్రత్యేకత. ఎవ్వరి వద్దనైనా సరే ఒకచోట ఒక వస్తువు చాలా నాణ్యతతో లభిస్తుంది అంటే వారు తమ తోటివారితో తప్పక చెప్తారు ఇది మానవ సహజం. ఇది గ్రామీణుల్లో ఇంకాస్త ఎక్కువ పాళ్ళలో వుంటుంది. ఆ గ్రామీణుల నాడిని పట్టుకోవడంతో, ఆ నోటా ఈ నోటా పడి ఆ ప్రాంత రైతాంగమంతా ఇతని వద్దకే వస్తూ వుండటంతో అతి త్వరలోనే ఇతని వర్క్‌షాప్‌కు మంచి గిరాకీ ఏర్పడింది. ఇతని ప్రాపకం ఆ ప్రాంతంలో ఎంతగా ప్రాకిపోయిందంటే, రైతుకైనా, ఎవ్వరికైనా సరే ఒక సమస్య వచ్చింది అంటే, దాని పరిష్కారానికి వారికి కావలసిన పరికరం ఎక్కడ తయారౌతుందంటే 'రాంబాబు' వద్ద తప్పక తయారు అవుతుంది అన్నంతగా ఇతని పేరు ప్రాచుర్యంలోకి వచ్చింది.

వచ్చిన వాళ్ళ ఆలోచనలను అవగాహన చేసుకోవడంతో పాటు, ఇతని నైజం కూడా కొత్తదనాన్ని కోరుకోవడం వల్ల అనతి కాలంలోనే ఇంత మంచి పేరు సంపాదించుకోగలిగాడు రాంబాబు. వీటన్నిటికి కారణం తాను మూడవ తరగతి చదివేటప్పుడే "ఐన్‌స్టీన్ అనే ఒక వ్యక్తి తన తల్లి ఒడిలో పడుకుని వున్నపుడు వారి ఇంట్లో పొయ్యి పైన అన్నం ఉడుకుతున్నప్పుడు పైన వున్న మూత కదలడం గమనించి నీరు





వేడి కావడంలో ఏదో శక్తి వుందని గ్రహించి, ఆ గ్రాహణ శక్తితోనే స్టీమ్ ఇంజన్‌తో రైలు నడిచేలా చేశాడు అన్న పాఠం నా మదిని ఎప్పుడూ తొలుస్తునే వుంటుంది. అందుకే నాకు జ్ఞానం వచ్చిన తర్వాత నేను చేసే ప్రతి పనిలో ఏదో ఓ కొత్తదనం, ఓ సృజన తప్పక ఉండేలా చూస్తాను" అని తన మధుర జ్ఞాపకాలను పంచుకున్నాడు రాంబాబు.

ఒక సామాన్యమైన వ్యక్తి, ఉన్నత చదువులు లేకుండా కేవలం తన మేధాశక్తితో గ్రామీణ ప్రజలకు, రైతులకు తనవంతు కర్తవ్యంగా శ్రమను తగ్గించే, డబ్బును ఆదా చేసే పరికరాలు, యంత్రాలు ఎన్నింటినో చేశాడు. ఇతని ఆలోచనంతా తక్కువ ధరలో పరికరం తయారు కావాలి, ఎక్కువ ఆదా, తక్కువ శ్రమ కలిగించేవిగా వుండాలి అన్నదే ఇతని ఆలోచన. అందులో మచ్చుకు కొన్ని పరికరాలు, వాటి పని తనాన్ని గురించి తెలుసుకుందాం.....

**ట్రాక్టరు అనుసంధానిత గొర్రు :**

సాధారణంగా వ్యవసాయానికి వినియోగించే ట్రాక్టరుకు గొర్రు తప్పనిసరిగా వుంటుంది. దాంతో పొలాన్ని తక్కువ లోతులో దున్నుకోవటమే కాక, విత్తనాలు వేయటానికి కూడా వినియోగిస్తారు. అంతే కాకుండా పొలంలో లోతుగా రసాయన ఎరువులు వేసే వారు ఇదే గొర్రుతోనే వేస్తారు. రసాయన ఎరువులు ఒక్కొక్కటి ప్రత్యేకంగా వేస్తే ఖర్చు ఎక్కువ అవుతుంది కాబట్టి అనుభవజ్ఞుల సూచన మేరకు రెండు మూడు రకాల ఎరువులను ముందుగా క్రింద పోసుకుని, కలగలుపుకుని ఈ గొర్రు సహాయంతో పొలంలో వేస్తూ వుంటారు. గత కొంత కాలం వరకు ఇది సాధారణంగా జరిగే పని. కానీ, పాశ్చాత్య పోకడలు పెరిగిపోయి, పల్లెలకు కూడా ప్రాకిపోవడంతో ఈ ఎరువులు కలిపేందుకు కూలీలు, రైతులు కూడా ఎక్కువగా మక్కువ చూపడం లేదు. ఈ అవసరాన్ని ఒక రైతు ద్వారా తెలుసుకున్న రాంబాబు ఇదే గొర్రుకు పై భాగంలో ఒక డబ్బా ఏర్పాటు చేశాడు. పొలంలో వెయ్యాల్సిన ఎరువులు రెండు లేదా మూడింటిని ఒకేసారి ఆ డబ్బాలో పోసిన తర్వాత దానికి ప్రక్కలో ఏర్పాటు చేసిన ఒక హ్యాండిల్ త్రిప్పడం ద్వారా కేవలం కొద్ది నిమిషాల్లోనే మూడు ఎరువులు సమానంగా కలిసి పోయేలా ఏర్పాటు చేశాడు. ఆ తర్వాత పొలంలో ఏ మోతాదులో ఎరువులు వేయాలో దానికి తగ్గ పరిమాణంలోనే భూమిలోకి ఎరువు వెళ్ళేలా ఏర్పాటు చేయడం వల్ల రైతు తన పొలంలో వేయాలనుకున్నంత ఎరువును తక్కువ శ్రమతో, త్వరగా వేసుకోవచ్చు.

ఈ ఏర్పాటు చేసుకున్న రైతులు కూడా 70-80 వేల రూపాయలు వెచ్చించినా చెయ్యలేని పని అతి తక్కువ ఖరీదులో చేసిన ఈ పరికరం వల్ల జరగడంతో ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇదే గొర్రుతో పంట పొలంలో ఎరువులు వేయాలి అనుకున్నా సరే వేసుకునే విధంగా గొర్రు కొయ్యలను 26 అంగుళాల ఎత్తు చేయటం వల్ల పంట రెండు అడుగులు పెరిగిన తర్వాత కూడా ట్రాక్టరుతో ఎరువులు వేసుకునే వెసులుబాటు కల్పించాడు. పైగా ప్రత్తి, మిరప లాంటి పొలాల్లో 4 సాళ్ళలో, సాలుకు రెండు వైపులా ఒకేసారి ఎరువులు పడేలా ఏర్పాటు చేశాడు. అంతే కాకుండా ఎరువు కేవలం గొర్రు ద్వారా వేయటం వల్ల అది పైనుండి తగిలే గాలి, సూర్యరశ్మి కారణంగా తన శక్తిని కోల్పోకుండా అలా పంట పొలంలో పడిన ఎరువుపైన వెంటనే మట్టి కప్పుకుని ఎరువు యొక్క పూర్తి సారం చెట్టుకు అందేలా ఆ గొర్రు సాలు వెనకంబడే మట్టి పూడ్చుకునేలా చిన్న ఎర్పాటు చేశాడు. ఇదే గొర్రుతో చెట్ల ప్రక్కన కలుపు నివారణ కూడా చేసుకునేలా మరో చిన్న ఏర్పాటు చేశాడు.

ఇలా రసాయన ఎరువులు రెండు లేదా మూడింటిని డబ్బాలో వేసి, అవి కలగలిసేందుకు కాసేపు తిప్పటానికి కూడా మనిషి ఇబ్బంది పడుతున్నాడని గ్రహించిన రాంబాబు ట్రాక్టరు



పొలంలో నడుస్తున్నపుడే ఎరువులు వాటంతట అవే కలిసిపోయేలా ఒక చిన్న చెయిన్ మరియు చక్రాల ద్వారా కూడా ఏర్పాటు చేయాలని ప్రయోగాలు చేస్తున్నాడు. దీన్ని ఇలా చేయటం వల్ల ట్రాక్టరు ద్వారా ఎరువులు వేసినా మనుషులు వేస్తూ వెళ్ళాల్సిన అవసరం లేకుండా రైతులకు కూలీల ఖర్చును మిగిల్చాడు.

**రాతి బొగ్గును చిన్న చిన్న ముక్కలుగా చేసే యంత్రం :**

ప్రభుత్వాలు, పర్యావరణ వేత్తలు అడవులను నశింప చేయకూడదనే క్లిష్టమైన ఆంక్షలు ఏర్పరచిన నేపథ్యం ఇటుకలు తయారు చేసే కార్మికులకు చాలా ఇబ్బందికరమైన పరిస్థితి ఏర్పడింది. ఈ సమస్య నుండి గట్టెక్కడానికి వారు కనుగొన్న సూత్రం 'రాతి బొగ్గు'. ఆ రాతిబొగ్గు సాధారణంగా పెద్ద పెద్ద రాళ్ళలాగా సరఫరా అవుతుంది. అంతటి పెద్ద పరిమాణంలో వున్న వాటిని నేరుగా ఇటుక బట్టీలలో వేయలేరు. ఇటుక బట్టీలలో 25 మి.మీ. పరిమాణంలో కొంత బొగ్గు, 40 మి.మీ. పరిమాణంలో కొంత బొగ్గు అవసరమౌతుంది. మట్టితో తయారు చేసిన ఇటుకలను కాలిస్తేనే వాటికి గట్టిదనం చేకూరుతుంది. ఇటుకలు అచ్చులు తయారు చేసిన తర్వాత వాటిని ఒక క్రమంలో పేర్చి, వాటిపైన ఒక వరుస వ్యవసాయ వ్యర్థాలైన పొట్టును వేస్తారు ఆ తర్వాత సన్న సైజు బొగ్గు, వాటిపైన మళ్ళీ ఒక వరుస పొట్టు, ఆ పైన పెద్దసైజు బొగ్గు, ఆ పైన మళ్ళీ పొట్టు వేసి కాలుస్తారు. గతంలో ఈ బొగ్గును ముక్కలు చేయటానికి కూలీలను నియమించే వారు. ఒక్కసారి ఇటుక బట్టీని కాల్చాలంటే దాదాపు 10 నుండి 20 మంది కూలీలు బొగ్గు పెళ్ళలను చేతితో పగలగొట్టే వారు. ఇటీవల కూలీల ఖర్చు విపరీతంగా పెరిగి పోవటం, కూలీలచేత చేయిస్తే ఆలస్యం అవటం మూలంగా ఈ బొగ్గును ముక్కలుగా చేసే యంత్రం అవసరమైంది. ఇటుక బట్టీల యజమానులు రాంబాబుతో సంప్రదించి అప్పటి వరకు ఈ ఇటుకను ముక్కలు





చేసే యంత్రాన్ని చూపించి, ఇది మా సమస్యను కొంత వరకే తీరుస్తుంది కాని, సమస్యకు పరిపూర్ణ మార్గం చూపించడం లేదు. మాకు బొగ్గు రెండు రకాల సైజుల్లో అవసరమౌతుంది. ఈ యంత్రం వల్ల పని కూడా అనుకున్నంత వేగంగా చేయలేక పోతున్నాము. దీనికి పరిష్కారం ఆలోచించమనటంతో దీన్ని తయారు చేశాడు రాంబాబు. ముందుగా ఒకేరకం పరిమాణం కత్తిరించే యంత్రం తయారు చేయగా దాన్ని హైదరాబాద్ లోని కొందరు ఇతని యంత్రాన్ని కాపీ చేసుకున్నట్లు తెలుసుకున్నారు. అప్పుడు దీనికి ఇంకా సామర్థ్యత పెంచాలని యోచించి రెండు పరిమాణాల్లో బొగ్గు ఒకేసారి ముక్కలు అయ్యేలా తయారు చేశాడు.

ఇది ట్రాక్టరు అనుసంధానిత యంత్రం. దీనిలో లావుపాటి బొగ్గు రాళ్ళను ఈ యంత్రంలో వేస్తే 25 మి.మీ. మరియు 40 మి.మీ. బొగ్గు రెండూ ఒకేసారి ముక్కలుగా తయారై బయటకు వస్తాయి. సాధారణంగా 10 టైర్ల లారీ లోడు బొగ్గును ముక్కలు చేయటానికి కూలీలకు ఒక నెల రోజుల సమయం పట్టేది. అలాంటిది ఈ యంత్రం చేయటం వల్ల కేవలం మూడు గంటలలోనే పని జరిగిపోవటం వల్ల బొగ్గు బట్టీల యజమానులకు ఎంతో ఉపశమనం లభించినట్ల యింది. ఈ యంత్రాలను ఇప్పటికే రాంబాబు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో 300కు పైగా యంత్రాలను తయారు చేసి ఇవ్వటం జరిగింది. దీన్ని గత 5 సంవత్సరాలుగా చేస్తూ వున్నాడు. రెండు రకాల సైజుల్లో ముక్కలు చేసే ఈ యంత్రం ఖరీదు ప్రస్తుతం 85 వేల రూపాయలు. దీనికి నిర్వహణా ఖర్చులు కూడా పెద్దగా వుండవు. కేవలం బేరింగులకు గ్రీజును పట్టించడం, అప్పుడప్పుడూ బేరింగులను, బొగ్గును ముక్కలు చేసే బ్లేడ్‌లను మార్చుకోవాల్సి వుంటుంది.

**ఇటుక తయారు చేసే మట్టిని తొక్కే ట్రాక్టరు చక్రాలు :**

ఇటుక తయారీకి ముందుగా బంక మట్టిని బాగా నానబెట్టి, మురిగిన తర్వాత ఆ మట్టిపైన ట్రాక్టర్లను తిప్పుతారు. అలా చేస్తేనే మట్టి బాగా కలిసిపోయి, జిగటగా మారి ఇటుక నాణ్యత బాగా వస్తుంది. ఇలా చేయటానికి ట్రాక్టర్లకు వరి మాగాణిలో రైతులు ఉపయోగించే ఇనుప చక్రాలను తగిలించుకుని మట్టిపైన తిప్పే వారు. ఇవి ఎక్కువసేపు తిరిగిందంటే ట్రాక్టరు వేడెక్కుతోందని ఇటుక బట్టీల యజమానులు రాంబాబును సంప్రదించారు. దీనికి పరిష్కార మార్గం ఆలోచించి మామూలు 48 అంగుళాల ఎత్తు వుండే ఈ చక్రాలను 60 అంగులాల ఎత్తు వుండేలా తయారు చేశాడు. ఇలా చేయటానికి రాంబాబుకు వచ్చిన ఆలోచన చాలా తమాషాగా అనిపించింది. సాధారణంగా ఎత్తు వున్న మనుషులు నడిచేదానికి, పొట్టిగా వున్నవారు నడిచే దానికి తేడా వుంటుంది అన్నది ఇతని సూత్రం. ఆ సూత్రాన్ని ఈ చక్రాలకు ఆపాదించటంతో, ట్రాక్టరుపై ఎలాంటి లోడు పడకుండా సులభంగా తిరుగుతుంది. పైగా ట్రాక్టరు మైలేజి కూడా పెరిగింది అంటున్నాడు రాంబాబు. ఆ చక్రాలు కూడా ట్రాక్టరు పెద్ద టైర్ల బటన్‌ల లాగే తయారు చేయటంతో ప్రస్తుతం ట్రాక్టర్లు ఇంజను భారం లేకుండా సునాయాసం గా మట్టిని తొక్కే పని చేయగలుగుతుంది అన్నాడు రాంబాబు.



**చేయాలనుకుంటున్న పరికరాలు :**

ఇప్పటి వరకు ప్రత్తి విత్తనాలు మనుషులతోనే నాటిస్తున్నారు. దానికి కారణం ప్రతి విత్తనం వరుసగా వేసేది కాదు. ఒకటి – రెండు అడుగుల దూరంలో విత్తాల్సి వుంటుంది. ఇది ట్రాక్టరు లేదా ఎద్దులతో విత్తడం సాధ్యం కాదు. కాబట్టి మనుషులతోనే చేయిస్తున్నారు. అందువల్ల రైతులకు కూలీల ఖర్చు ఎక్కువ అవుతోంది. ఈ సమస్యకు పరిష్కారం తన మదిలో వుందని, ఎంత దూరం కావాలంటే అంత దూరంలో సమానంగా విత్తేలా ట్రాక్టరు పరికరం తయారు చేయగలను అంటున్నాడు.

ప్రస్తుతం ఈ పరికరాన్ని తయారు చేస్తున్నాను, ఒకేసారి నాలు సాళ్ళల్లో ఒకటిన్నర అడుగులకు ఒక్కో విత్తనం విత్తేలా, ఒక్కో సాలుకు మధ్య 4 అడుగులు వుండేలా, నాలుగు సాళ్ళు ఒకేసారి విత్తేలా ఈ పరికరం వుంటుంది. వచ్చే ఖరీఫ్ సీజన్‌కల్లా ఈ పరికరం పూర్తవుతుంది అంటున్నాడు. దీనివల్ల రైతులకు వేలాది రూపాయల విత్తనం విత్తే ఖర్చు తగ్గిపోతుంది అన్నాడు.

ఎటువంటి ఇంధనం లేకుండా విద్యుత్తును ఉత్పత్తి చేసే ఆలోచన తనకు ఎప్పటినుంచో వుందని, ఆ పరికరాన్ని కొంత వరకు తయారు చేశానని, దాన్ని కూడా త్వరలో పూర్తి చేసి, ముందుగా తన షాపులోనే ఎటువంటి ఇంధనం లేకుండా విద్యుత్తును ఉత్పత్తి చేసుకునే ఆలోచనలో వున్నట్లు తెలిపాడు రాంబాబు. 18 సంవత్సరాల క్రితం ఈ యంత్రం తయారు చేస్తున్నపుడు ఎంతోమంది తనను నిరుత్సాహ పరిచారని, నాడు ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా కూడా ముందుకు తీసుకు వెళ్ళలేక పోయానని, ప్రస్తుతం సాంకేతికత బాగా పెరిగి పోయింది కాబట్టి ఇప్పుడు దాన్ని తయారు చేయటం ఇంకా సులభమని, త్వరలోనేఈ యంత్రాన్ని కూడా పూర్తి చేస్తానని విశ్వాసంతో అన్నాడు రాంబాబు.

రాంబాబు క్రియాశీలుడు. ప్రజజల అవసరాలకు తగ్గట్లుగా తమ శక్తిని ఉపయోగించి, వారికి ఆర్థికంగా, శ్రమపరంగా పొదుపు చేసే యంత్రాలు, పరికరాలు చేయడం ఒక అద్భుత ప్రక్రియ. సామాన్య ప్రజల కష్టాలను, బాధలను తగ్గిస్తే, వారు ఆనంధంగా ఉంటారు. రాంబాబు జీవిత లక్ష్య సాధన సమాజాన్ని ఆనందంగా ఉంచడానికి అంకితమైందని 'పల్లెసృజన' నమ్ముతోంది. ●

**చింతకాయల రాంబాబు ఫోన్ నెం : 9949927037**

# తమ సృజనలకు పేటెంటు పొందిన నలుగురు ఇన్నోవేటర్లు

## చింతకింది మల్లేశం



పోచంపల్లి చేనేత పరిశ్రమలో విప్లవాత్మకమైన మార్పు తీసుకు వచ్చిన 'ఆసు పోసే యంత్రం' తయారు చేసిన చింతకింది మల్లేశం యంత్రానికి 'పేటెంటు' లభించింది. ఈ యంత్రం తయారీతో 'టై& డై' పద్ధతిలో పనిచేసే నేత కార్మికుల ప్రధాన అవస్థను తొలగించిన 'లక్ష్మీ ఆసు యంత్రం' మల్లేశానికి 'అమేజింగ్ ఇండియన్', 'పద్మశ్రీ' లాంటి అత్యున్నత పురస్కారాలను కూడా అందించింది. ఈ యంత్రం రాకతో 'ఒకప్పుడు ఆసు చేతితో పోసే వారట' అని చరిత్రలో చెప్పుకునే లా ఒక వ్యవస్థను రూపు మాపిన ఈ యంత్రానికి ఇప్పుడు పరిపూర్ణ హక్కులు లభించినట్లయింది.

## ముళ్ళపూడి సత్యనారాయణ



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పినపాక మండలం, మణుగూరు గ్రామానికి చెందిన ముళ్ళపూడి సత్యనారాయణ ఒక సృజనాత్మక రైతు. తన అవసరాలను తీర్చుకోవడానికి సృజనాత్మకంగా ఆలోచించి అందుకు అనువైన పరికరాన్ని తయారు చేయగల ఇన్నోవేటర్.

సాధారణంగా ట్రాక్టర్ అనుసంధానిత 'టిల్లర్' (గొర్రు/ నాగలి) భూమికి సమాంతరంగా పొలాన్ని దున్నుకుంటూ వెళుతుంది. కానీ, పొలం గట్టుల వద్ద భూమి ఎత్తుగా వుండటం లేదా గట్టి వుంటుంది. అటువంటి ప్రదేశాల్లో కూడా ఈ టిల్లర్ ఎటువైపు ఎక్కువ లోతు దున్నాలో అటువైపు లోతుగా వెళ్ళేలా టిల్లర్‌ను రూపొందించినందుకు భారత ప్రభుత్వం ఇతనికి 'పేటెంటు'ను ఇచ్చింది.

## నన్నం తిరుపతిరావు



ప్రకాశం జిల్లా, కారంచేడు మండల కేంద్రానికి చెందిన ఒక సామాన్య విద్యుత్ స్తంభాలను ఎక్కి రిపేర్లు చేసే దినసరి కూలీ. తాను పని చేస్తున్నపుడు తన తోటి కార్మికులు కొంతమంది కరెంటు స్తంభం పైనుండి కిందపడటం, వార్తా పత్రికల్లో కొందరు మరణిస్తున్న విషయాను గమనించి కలత చెంది ఇకపై ఏ విద్యుత్ కార్మికులకు ఇటువంటి పరిస్థితి రాకూడదని సంకల్పించి తయారు చేసిన 'కరెంటు స్తంభాలను సులభంగా ఎవ్వరైనా ఎక్కేందుకు తయారు చేసిన పరికరం' ఎంతోమంది జీవితాలను ఇప్పటికే కాపాడింది అన్న విషయం 'పల్లెసృజన' పాఠకులకు తెలిసిందే. ఇతను తయారు చేసిన ఈ 'పోల్ క్లైంబింగ్' పరికరానికి పేటెంటు లభించింది.

## గాండ్ల గురుమూర్తి శెట్టి



చిత్తూరు జిల్లా, పలమనేరుకు చెందిన సామాన్య రైతు 'గాండ్ల గురుమూర్తి శెట్టి' (బాబు). తన పొలంలో ఎదురయ్యే సమస్యలకు తానే పరిష్కారాలు వెతుక్కుని వాటిని తీర్చుకునేందుకు తగిన పరికరాలను తానే స్వయంగా తయారు చేసుకునే సృజనాత్మక రైతు.

సాధారణంగా బోరు బావులు వేసేటపుడు కొద్ది అడుగుల లోపలే నీరు పడుతుంది. ఆ నీటిని బోరు బావిలోకి రాకుండా పివిసి పైపులను వేయటం ద్వారా ఆ ప్రాంతంలోని జలధార బావిలోకి రాకుండా పోతుంది. ఈ సమస్య పరిష్కారానికి త్రవ్విన బోరు బావిలోనే పైపులకు అక్కడక్కడా రంధ్రాలు చేయడం ద్వారా భూమిలోని ఎక్కడున్న నీటి ఊట అయినా సరే బోరు బావిలోకి వచ్చేలా రంధ్రాలు చేసే పరికరం తయారు చేయడంతో దానికి పేటెంటు లభించింది.

# 'డా. కలాం ఇన్నోవేషన్ ఫెస్టివల్' లో వెలిగిన 'పల్లెసృజన' ఇన్నోవేటర్ల ప్రతిభ




మాజీ సిబిఐ జాయింట్ డైరెక్టర్ జె.డి. లక్ష్మి నారాయణ స్థాపించిన 'జె.డి. (జాయిన్ ఫర్ డెవలప్‌మెంట్) ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 27 & 28 తేదీలలో ఆంధ్రప్రదేశ్ లోని 'భీమవరం' పట్టణంలో 'డా. కలాం ఇన్నోవేషన్ ఫెస్టివల్' కార్యక్రమం నిర్విహించారు.

ఈ కార్యక్రమంలో 'పల్లెసృజన' ఇన్నోవేటర్లు తమ ఇన్నోవేషన్లను ప్రదర్శించారు. ప్రదర్శనలో పాల్గొన్న ఇన్నోవేషన్ల ను జ్యూరీ ప్రకటించిన బహుమతులలో నాలుగింటిని 'పల్లెసృజన' ఇన్నోవేటర్లు కైవసం చేసుకున్నారు. వారి వివరాలు....

దామరసింగి బాబూరావు 'మల్టీపర్పస్ డ్రమ్ సీడర్' అవార్డుతో పాటు లక్ష రూపాయల నగదు పారితోషికాన్ని పొందారు. కంటాలి పాండురంగారావు 'ప్లాస్టిక్ వ్యర్థాలను ఉపయోగకర వస్తువులుగా రూపాంతరం చేసి, ప్లాస్టిక్‌ను శాశ్వత రీసైకిల్ గా చేసిన' విధానానికి పురస్కారంతో పాటు రూ. 50 వేలు నగదు పురస్కారం కూడా అందుకు న్నాడు. గోదాసు నర్సింహ రూపొందించిన 'గుర్రపు డెక్కను సులభంగా తీసివేసే యంత్రం' తయారు చేసినందుకు పురస్కారంతో పాటు రూ. 50 వేల నగదు పురస్కారాన్ని సాధించాడు. కొల్లి నాగశ్రీనివాస్ తయారు చేసిన 'వరిమళ్ళలో ఎటువంటి ఆయాసం లేకుండా కలుపు తీసే పరికరం' ఇన్నోవేషన్ కు గాను పురస్కారంతో పాటు రూ. 10 వేల నగదు బహుమతిని అందుకున్నాడు.

పల్లెసృజన ఇన్నోవేటర్లు ఆంధ్రప్రదేశ్‌లో ప్రతినిధి ఉప్పుతేళ్ళ ఏడుకొండలు (కృష్ణ) ఈ కార్యక్రమం లో పాల్గొని విజయ కేతనాన్ని ఎగురవేశారు. జెడి ఫౌండేషన్ వ్యవస్థాపకులు జెడి లక్ష్మి నారాయణ గారికి కృష్ణ ధన్యవాదాలు తెలియజేశారు. ●


బహుమతులు అందుకుంటున్న.....


దామరసింగి బాబూరావు


కంటాలి పాండురంగారావు


గోదాసు నర్సింహ


కొల్లి నాగ శ్రీనివాస్



## డా. ఎపిజె అబ్దుల్ కలాం

# ఇగ్నైట్ పోటీలు 2020

> " నేర్చుకోవటం వల్ల సృజనాత్మకత వస్తుంది
> సృజనాత్మకత ఆలోచనలకి దారి తీస్తుంది
> ఆలోచనలు జ్ఞానాన్నిస్తాయి
> జ్ఞానం మిమ్మల్ని గొప్పవాళ్ళను చేస్తుంది "

**'నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ - ఇండియా'** పాఠశాల విద్యార్థుల కొరకు వారి స్వంత సాంకేతిక ఆలోచనలు మరియు సృజనల జాతీయ స్థాయి పోటీలను నిర్వహిస్తున్నది.

**'డా. ఎపి.జె. అబ్దుల్ కలాం ఇగ్నైట్ పోటీలు-2020'** కి దరఖాస్తులు పంపుటకు **చివరి తేది 31 ఆగస్టు, 2020.** ఎన్ఐఎఫ్ పిల్లల సృజనాత్మకత మరియు ఇన్నోవేషన్ దినంగా జరుపుకునే మన మాజీ రాష్ట్రపతి దివంగత డా. ఎపిజె అబ్దుల్ కలాం గారి జయంతి రోజు (అక్టోబర్ 15)న విజేతల పేర్లు ప్రకటిస్తుంది.

అర్హమైనవి అని భావించిన ఇన్నోవేటివ్ ఐడియాలు/ప్రాజెక్టులను 'నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్' గుర్తించి, వాటి అభివృద్ధికి, పేటెంట్‌కు సహకరిస్తుంది. 12వ తరగతి (10+ ఇంటర్మీడియట్) వరకు చదువుతున్న విద్యార్థులు (పాఠశాలేతర విద్యార్థులు, 17 సంవత్సరాల లోపు చిరంజీవులు కూడా) తమ ఎంట్రీలను తమ చిరునామా, పిన్ కోడ్, సెల్ ఫోన్‌తో సహా ఒక కాగితంపై వివరంగా వ్రాసి పోస్టు ద్వారా ఈ క్రింది చిరునామాలకు, లేదా ఈ-మెయిల్ ignite@nifindia.org ద్వారా పంపవచ్చు. ఆన్‌లైన్‌లో ద్వారా కూడా పంపవచ్చు.

పూర్తి వివరాలకు సంప్రదించండి :
**www.nif.org.in/ignite**

**National Innovation Foundation-India**
**Grambharati, Amarapur, Gandhinagar- Mahudi Road,**
**Gandhinagar - 382650, Gujarat, India.**
**Tel : 02764 261131/ 32/ 38/ 39, Fax : 011 43851803**
**E-mail : ignite@nifindia.org, web : www.nif.org.in/ignite**

dst.gov.in | honeybee.org | gian.org | sristi.org | cbse.nic.in

# ఆయుర్వేద జ్ఞాన మథనం

# 'నీరు - సైంధవ లవణం' లలో ఔషధ గుణాలు

పంచ భూతాలలో 'నీరు' ఎంతో ప్రధానమైనది. ఆ నీటితో కూడా అద్భుతమైన చికిత్సలు చేయవచ్చు. మన వేదాలలో సమాజానికి అందించిన ఎన్నో విషయాలను గ్రహించలేక పోతున్నాము మనం. కానీ, ఈ వేద జ్ఞానాన్ని పాశ్చాత్యులు అర్థం చేసుకుని, ఎంతో వినియోగించుకుని వాటిని తామే కనిపెట్టినట్లు పేటెంటు తీసుకుని, తిరిగి మనకే విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

అధర్వణ వేదంలో నీటితో చికిత్సను గురించి చెప్పబడింది. మహర్షులు నీటిని 'అమృతం'తో పోల్చారు. ఇప్పటికీ కొందరు వేదాంతులు నీటిని ఇవ్వమని అడగకుండా 'కాస్త అమృతం ఇవ్వమ్మా' అంటున్న వారు కూడా వున్నారు.

నిద్ర లేవగాని, కాఫీ, టీ లాంటి వాటి అలవాటు మాని, నాలుగు గ్లాసుల నీరు త్రాగాలి. ఆ నీటిని ఒక రాగి చెంబులో రాత్రిపూట నింపి, ఒక చెక్క బల్లపైన వుంచాలి. నిద్ర లేవగానే ఆ నీరు త్రాగాలి. ఇది ఒకేసారి త్రాగటం కొంచెం కష్టమే అయినా రోజూ అలవాటు చేసుకోవటం ద్వారా ఇది సాధించవచ్చు. ఈ నీటిని త్రాగేటపుడు ఒక కుర్చీలో కూర్చుని త్రాగితే మంచిది. నేలపైన నిలబడి త్రాగటం చేయకూడదు. ఈ నీరు త్రాగిన తర్వాత 45 నిమిషాల సేపు ఏమీ తినకుండా, త్రాగకుండా వుంటే శరీరానికి వచ్చే జబ్బులు దరి చేరవు సరికదా వున్న జబ్బులు కూడా త్వరగా నయమయ్యే అవకాశాలు మెండుగా వుంటాయి. ఈ నీటిని ఒకేసారి



త్రాగలేకున్నా, రెండుమూడు సార్లు త్రాగినా పర్వాలేదు. ప్రతిరోజూ ఇలా చెయ్యటం వలన మన శరీరానికి ఈ నీటి థెరపీ 'కంచు కవచం'లా పని చేస్తుంది. ఈవిధంగా చేయటం వల్ల ఎన్నో జబ్బులు నయమైన దాఖలాలు కూడా కోకొల్లలు. ప్రతి రోజూ ఇలా చేస్తే సాధారణ జబ్బులు మన జోలికి రావు సరికదా, ప్రాణాంతక వ్యాధుల నుండి కూడా కొద్దిగా ఉపశమనం కలుగుతుంది.

కొన్ని సంవత్సరాల క్రితం 'ఆయిల్ పుల్లింగ్' ప్రక్రియ విపరీతమైన ప్రచారం జరిగింది. అది ఎంతటి విపరీతమంటే ఆ సమయంలో నూనెల విక్రయాలు కూడా ఎంతో పెరిగిపోయాయి. అలా మొదలైతే పెట్టారు కానీ, వారు తెచ్చుకున్న నూనె అయిపోగానే ఆయిల్ పుల్లింగ్ చేయటం మానేశారు.

ఊబకాయం వున్నవారు, మధుమేహం, రక్తపోటు వున్నవారు ఈ నీటి థెరపీ చేస్తే తప్పక ప్రయోజనం వుంటుంది. గ్యాస్ ట్రబుల్, అల్సర్ల నుంచి కూడా ఉపశమనం పొందవచ్చు.

**సైంధవ లవణం దానిలోని ఔషధ గుణాలు :**

మన నిత్య జీవితంలో వంటల్లో ఉప్పు వాడటం సర్వ సాధారణం. దీన్నే 'లవణం' అని కూడా అంటారు. పూర్వం నుండి కూడా మనం సముద్రపు ఉప్పుని వాడేవాళ్ళం. ఈ లవణంతో పాటు మరో నాలుగు లవణాలను జోడించి 'పంచ లవణాలు'గా ఆయుర్వేదం వాటి ఔషధ గుణాలను పొందుపర్చింది. సైంధవ, బిడ, కాక, సమర్థ లవణాలను సముద్రపు లవణంతో జోడించింది. వీటినే 'పంచ లవణాలు' అంటారు. ఈ ఐదు లవణాలలో ఒక్కోదాంట్లో ఒక్కో లక్షణం వుండటం వల్ల ఆరోగ్యానికి ఎంతో ఉపయుక్తమైనవి. ఈ లవణాలను వాడటం వల్ల ఎన్నో రోగాలను నియంత్రణలో ఉంచుకోవచ్చు.

సైంధవ లవణాన్ని 100 గ్రాములు, 300 గ్రా. వాము తీసుకొని, రెండింటిని దోరగా వేయించి, పొడిగా బాగా కలిపి ఒక సీసాలో తీసి వుంచుకోవాలి. రోజూ ఉదయం, సాయంత్రం

భోజనం తర్వాత ఒక పావు స్పూను నోట్లో వేసుకున్నట్లయితే, అజీర్ణం, కడుపులో ఉబ్బరం, కండరాల నొప్పు లాంటివన్నిటి నుంచి ఉపశమనం పొందవచ్చు. దీన్ని పిల్లలు, పెద్దలు, వృద్ధులు అందరూ ఉపయోగించుకోవచ్చు. ఈ సైంధవ లవణం వాడటం వలన రక్తపోటు, మధుమేహం ఎప్పుడూ నియంత్రణలో వుంటాయి. ముఖ్యంగా రక్తపోటు (బిపి) వున్నవారు దీన్ని ఉపయోగిస్తూ వుంటే బిపి ఎప్పుడూ నియంత్రణలో వుంటుంది, ఇక పెరగదు.

కొందరు చిన్న పిల్లలు కాళ్ళు నొప్పిగా వున్నాయని, బెణుకు వచ్చిందని ఏడుస్తూ వుంటారు. వారికి నెయ్యి, తేనె, సైంధవ లవణం కలిపి నొప్పి వున్నచోట ఒక పట్టీగా వేసినట్లయితే కేవలం 10–15 నిమిషాల్లోనే ఉపశమనం లభిస్తుంది.

పంటి బాధలు వున్నవారు సైంధవ లవణం, కరక్కాయ, జాజిపళ్ళు కలిపి మెత్తగా నూరుకుని, ఆ మిశ్రమంతో పళ్లు తోముకున్నటయితే పంట బాధల నుండి త్వరగా ఉపశమనం పొందవచ్చు.

సైంధవ లవణాన్ని కొద్దిగా నీటిలో కలిపి 'ఎక్కిళ్ళు' ప్రమాదకరంగా మారిన వారికి  రెండు ముక్కు రంధ్రాల్లో ఒక్కో చుక్క వేసినట్లయితే వెంటనే వెక్కిళ్ళు తగ్గిపోతాయి.

కొందరికి మలం ఉండలు ఉండలుగా వస్తూ వుంటాయి, వారు మల విసర్జనకు ఎంతో ఇబ్బంది పడుతూ వుంటారు అటువంటి వారు నెయ్యి, సైంధవ లవణం కలిపి తీసుకున్నట్లయితే విరోచనం చాలా సాఫీగా వస్తుంది. కడుపులో వికారంగా వున్న వారికి కూడా ఇది బ్రహ్మాండంగా పని చేస్తుంది.



సైంధవ లవణం, కరక్కాయ, జీలకర్ర, సోపు లను దోరగా వేయించి, పొడి చేసుకుని ఒక సీసాలో తీసి వుంచుకుని, భోజనం అనంతరం కొద్దిగా నోట్లో వేసుకుంటున్నట్లయితే ఉదర సంబంధ వ్యాధుల నుండి ఉపశమనం పొందవచ్చు, అన్నం అరుగుదల సాఫీగా జరుగుతుంది. అజీర్తి వ్యాధులు దరిచేరవు.

మన పూర్వీకులు వీటన్నిటినీ ఆచరించి, మంచి ఫలితాలను పొంది గ్రంథాల ద్వారా మనకు అందజేసిన ఈ సాంప్రదాయ జ్ఞానాన్ని పాటిస్తూ వుంటే అనవసరపు అనారోగ్య ఖర్చుల నుండి విముక్తి పొందవచ్చు, ఆరోగ్యంగా కాలం గడపవచ్చు.

### ఇవి మీకు తెలుసా?

- అల్లం తింటే ఎక్కిళ్ళు తగ్గుతాయి.
- కరివేపాకు రక్తహీనతను తగ్గిస్తుంది.
- నేరేడు పండ్ల గింజల్లో వుండే జంటోలిన్ అనే గ్లూకోసైట్ మధుమేహాన్ని అదుపులో ఉంచుతుంది.
- గుమ్మడికాయ మూత్ర సంబంధ వ్యాధులను తగ్గిస్తుంది.
- జామపళ్ళు హార్మోన్ల హెచ్చుతగ్గులను నివారిస్తాయి.
- బ్లాక్ టీ మధుమేహాన్ని దూరంగా ఉంచుతుంది.
- సజ్జల్ని ఎక్కువగా తీసుకుంటే పైల్స్ బాధ నుంచి ఉశమనం లభిస్తుంది.
- బీట్‌రూట్ రక్తపోటును క్రమబద్ధీకరిస్తుంది.
- మునగాకు తింటే గాస్ట్రిక్ సమస్యల నుండి విముక్తి లభిస్తుంది.
- దానిమ్మ రసం కామెర్లకు మంచి మందుగా పని చేస్తుంది.
- ఆవాలను క్రమం తప్పకుండా తీసుకుంటే ఇన్సులిన్ వృద్ధి చెందుతుంది.
- అల్లం కడుపు ఉబ్బరాన్ని తగ్గిస్తుంది. మలబద్ధకాన్ని కూడా వదిలిస్తుంది.
- కీరదోసలో ఉండే సిలికాన్ సల్ఫర్‌లు శిరోజాలకు మేలు చేస్తాయి.

**గమనిక :** ఈశీర్షికలో ప్రచురించిన వైద్యాలన్నీ ఆయా వ్యక్తుల అభిప్రాయాలు మాత్రమే. వీటిని వాడేముందు విజ్ఞులైన వైద్యులతో సంప్రదించి వాడితే శ్రేయష్కరం.

**ఉమా మహేశ్వర రావు ఫోన్ నెం. : 94402 86854**

# స్పందన

30 మరిచిపోలేని శోధ యాత్రలు, ఆ జ్ఞాపకాలు ఎప్పుడూ వెంటాడుతునే ఉంటాయి. నేను మామూలుగా అవడానికి కనీసం వారం రోజులు పడుతుంది. ఈ యాత్రలో ఇక హెూటల్ వాళ్ళు నమ్మకంతో మనకి 3 రోజులకు గిన్నెలు ఇచ్చారు అడ్వాన్స్ డబ్బు లేకుండా. ఒక్కరోజు కూడా మనం భోజనం ప్లేట్లను పడవేయలేదు ఈ యాత్రలో. మనం చేసే మంచి పనే మనపైన ఎదుటివారికి ఒక బలమైన నమ్మకం వస్తుంది. నాకు ఒక్కో యాత్ర ఒక డిగ్రీ అనిపిస్తుంది. కనీసం 500 పైగా గ్రామాలు రకరకాల మనుషులు, వారి మనస్తత్వం అన్ని అర్థం అవుతాయి. ఇన్ని కొత్త ప్రాంతాలు చూసిన నా అంత అదృష్టవంతుడు లేదు అనిపిస్తుంది. నిజంగా 'పల్లెసృజన'కి పాదాభివందనం.

– **ముప్పారపు రాజు**, స్కౌట్, వరంగల్.

ముప్పారపు రాజు, నీవు పల్లెసృజనకు ఇన్నోవేటర్లను పరిచయం చేయడం, దాదాపు అన్ని శోధయాత్రల్లో పాల్గొని, యాత్రీకులకు ఎటువంటి లోటు కలగకుండా చేస్తున్న సేవలు అనిర్వచనీయం. నీలాంటి యువత సహకారం వల్లనే నేడు మన 'పల్లెసృజన' ఎన్నో శిఖరాలను అధిరోహిస్తోంది.

ఇటీవల నన్ను 'పల్లెసృజన' కృష్ణ గారు నావద్దకు వచ్చి నేను చేస్తున్నవన్నీ ఇన్నోవేషన్లు అని చెప్పేంత వరకు అసలు నేను చేస్తున్నవి ఇన్నోవేషన్లనీ, వీటివల్ల సమాజానికి, రైతాంగానికి ఎంతో మేలు చేకూరుతుందన్న విషయమే నాకు తెలియలేదు. నేను ఎంతసేపు నా వ్యాపార పరిధిని పెంచుకునేందుకు నావద్దకు వచ్చిన కష్టమర్ల ఆలోచనను తెలుసుకుని వారికి తమ ఆలోచనలకంటే ఇంకా ఎక్కువ ప్రయోజనం చేకూరేలా చేశానని తృప్తి పడ్డానే కాని, ఇవి ఇన్నోవేషన్లని తెలియలేదు. 'పల్లెసృజన' లాంటి సంస్థ ఇదివరకే పరిచయమై వుండివుంటే ఇంకా ఎన్నో అద్భుతాలు చేయగలను అన్న నమ్మకం నాకుంది. ఇప్పటికైనా మించిపోయింది ఏమీ లేదు. అతి త్వరలో ఓ కొత్త ఇన్నోవేషన్‌తో మీ ముందుకు తప్పక వస్తాను. మాలాంటి వారికోసం ఇంత మహాయజ్ఞం చేస్తున్న 'పల్లెసృజన' కుటుంబానికి ధన్యవాదాలు.

– **చింతకాయల రాంబాబు**, జి. కొండూరు, కృష్ణా జిల్లా.

మీరు పల్లెసృజన కుటుంబంలో చేరడం అదృష్టం. ప్రజల సాంకేతిక అవసరాలను అక్కడే తీరుస్తున్న మీరు ఒక పెద్ద పరిశ్రమ కంటే తక్కువేం కాదు. పరిశోధన – ఉత్పత్తి రెండూ అద్భుతంగా, స్థానికంగా ప్రజలకు అందిస్తున్న మీకు మీలాంటి ఎంతోమంది ఇన్నోవేటర్లకు 'పల్లెసృజన' నమస్సులు. మనమంతా కలిసి మరిన్ని ఆవిష్కరణలు చేసి ప్రజలకు అందించి, సమాజంలో ఆనందాన్ని పెంచుదాం.

**-ఎడిటర్**


**FORM IV**

***Statement about ownership and other particulars about newspaper (PALLE SRUJANA) to be published in the first issue every year after the last day of February***

| | | | |
|---|---|---|---|
| 1. | Place of publication | : | **102, Vayupuri, Sainikpuri Post,** Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094. Teelangana |
| 2. | Periodicity of its publication | : | **Bi-Monthly** |
| 3. | Printer's Name | : | **P. Ganesham** |
| | Nationality | : | Indian |
| | Address | : | 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094. Telangana |
| 4. | Publisher's Name | : | **P. Ganesham** |
| | Nationality | : | **Indian** |
| | Address | : | 102, Vayupuri, Sainikpuri Post, Malkajgiri Mandal, Medchal-Malkajgiri Dist. –500094. Telangana |
| 5. | Editor's Name | : | **J. Seshi Mohan** |
| | Nationality | : | **Indian** |
| | Address | : | 2-1-513/2, Nallakunta, Hyderabad - 500 044. |
| 6. | Names and addresses of individuals who own the newspaper and partners or shareholders holding More than one per cent of the total capital. | | |

I, **P. GANESHAM**, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Date28-02-2017

**Signature of Publisher**

పల్లెసృజన
www.pallesrujana.org

# అమ్మకానికి సిద్ధంగా వున్న రైతుల కోసం రైతుల ఇన్నోవేషన్లు

## మహిపాల్ కల్టివేటర్



సామాన్య రైతులకు అందుబాటులో వుండే ఈ "మహిపాల్ కల్టివేటర్" తో ఇక ప్రతి చిన్న రైతూ తన సేద్యాన్ని ఇతరులపై ఆధారపడకుండా చేసుకునే వీలుతో పాటు ఇతరులకు కిరాయికి అందిస్తూ ఉపాధి పొందవచ్చు. ఇప్పటికే దేశం మొత్తంమీద వెయ్యికి పైగా యంత్రాలు అమ్మబడినవి. ఒక హెక్టారు పొలాన్ని రెండున్నర గంటల్లో కేవలం మూడున్నర లీటర్ల డీజిల్‌తో సేద్యం చేయవచ్చు. వరుసల మధ్య 2 అడుగుల వెడల్పు కలిగిన ప్రత్తి, కంది, మిరప, చెఱకు లాంటి పంటలలో అంతర సేద్యాలకు మరియు అన్ని రకాల పండ్ల తోటల్లో కలుపు తీయటానికి అనువైనది. రైతు తన అవసరాన్ని బట్టి 4 మరియు 5 హార్స్ పవర్ శక్తి గల కల్టివేటర్లుగా లభిస్తుంది.

## స్కూటర్ ఇంజన్‌తో సేద్యానికి వీడర్



పెట్రోలు సహాయంతో నడిచే స్కూటర్ ఇంజన్‌తో చేయబడిన ఈ వీడర్ వెడల్పు 2 అడుగులు వుంటుంది. వీటి టైర్లలో గాలితో పాటు నీటిని నింపటం వల్ల పొలంలో యంత్రం ఎటువంటి కుదుపులు లేకుండా స్థిరంగా నడుస్తుంది. రైతు తనంతట తానే అవసరమైన మరమ్మత్తులు చేసుకోవచ్చు. అంతర సేద్యాలు, పండ్ల తోటల్లో చెట్లచుట్టూ కలుపు తీసుకోవడానికి అద్భుతంగా పని చేస్తుంది. ఇప్పటికే ఎంతోమంది రైతుల మన్ననలు పొందింది. ఎకరాకు ఒక లీటరు పెట్రోలు ఖర్చుతో రోజుకు 4 ఎకరాల పొలం దున్నుకోవచ్చు.

## వరిలో కలుపు తీసే పరికరాలు



వరిలో కలుపు, బెరుకులను తీసివేసేందుకు మనిషి బురద నీటిలో వంగి వాటిని పీకివేయాల్సి వుంటుంది. ఇలా చేయటం వలన ఎక్కువ అలుపు రావటంతో పని తక్కువగా జరుగుతుంది. ఈ పరికరాల వల్ల మనిషి ఎలాంటి అలుపు లేకుండా నిలబడే వాటిని సులభంగా తీసివేయవచ్చు.

## బహుళ ప్రయోజనాల విత్తనం గొర్రు



రైతులకు నానాటికీ పెరుగుతున్న కూలీల భారాన్ని తగ్గించే ఈ పరికరంతో విత్తనం వేయటం, ఎరువులు వేయటం, వేసిన విత్తన సాళ్ళను మూయటం (గుంటక) పనులను ఒకేసారి చేయవచ్చు. ఇద్దరు వ్యక్తులు లేదా ఒక జత ఎద్దులతో ఈ పరికరంతో దాదాపు అన్ని రకాల విత్తనాలు వేసుకోవచ్చు. విత్తనం ఖర్చు 80 శాతం వరకు మిగులుతుంది. దిగుబడి కూడా పెరుగుతుంది.


పరికరాలు కావలసిన వారు సంప్రదించండి :

**పి. వీరరాఘవ రెడ్డి, ఫోన్ : 81257 99904/ 7989038186**

**బి. సుభాష్ చందర్, ఫోన్ : 9652801700**

PALLE SRUJANA Telugu Bi-monthly January - February 2020 RNI No. TELTEL 2012/74620

# పల్లెసృజన

## పాత సంచికలు కావాలా?

ఒక్కో సంచిక రూ. 30/-లు మాత్రమే














పల్లెసృజన చందాదారులు కండి, పల్లె జ్ఞానాన్ని వ్యాపింపజేయండి. చందాదారులుగా చేరాలనుకున్నవారు ఈ క్రింది చిరునామాకు మీ యం.ఓ.లు పంపండి. మీ చిరునామా స్పష్టంగా వ్రాయటం మరవకండి.

**చందా వివరాలు**

| వివరములు | వ్యక్తిగతం | సంస్థ/లైబ్రరీ |
|---|---|---|
| రెండు సంవత్సరాలకి | 400/- | 1,600/- |
| ఐదు సంవత్సరాలకి | 1,000/- | 4,000/- |

పల్లెసృజన, 102, వాయుపురి, సైనిక్‌పురి పోస్ట్,
సికింద్రాబాద్ - 500 094. ఫోన్ : 040-27111959, సెల్ : 8125799904, 9866 00 1678
E-mail : president@pallesrujana.org Visit us : www.pallesrujana.org

లేదా నేరుగా ఈ బ్యాంక్ అకౌంట్‌లో జమ చేయండి.
మీ చిరునామాను స్పష్టంగా మాకు వ్రాసి పంపండి లేదా యస్.యం.యస్. లేదా ఇ-మెయిల్ చేయండి.

M/s Pallesrujana, Syndicate Bank, Sainikpuri, Secunderabad.
SB A/c No. 30232200019150, IFS Code : SYNB0003023

లేదా 'ఫోన్ పే' చెయ్యాలనుకున్న వారు 9866 00 1678 నెంబరుకు పంపి మీ చిరునామా ఎస్‌ఎంఎస్ లేదా వాట్స్‌యాప్‌లో పంపండి.

PhonePe

Narendra Grafix, Hyd. Ph.: 81257 99904